
■ లోపలి పేజీలో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



3
ఏలూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 5 సెప్టెంబరు 2025

భారం దిగింది!



పేదలు, మధ్య తరగతికి ఊరట నిచ్చేలా జీఎస్టీ శ్లాబులు కుదింపుతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మరికొన్నింటిలోను జీఎస్టీ తగ్గించడం, లేదా ఎత్తివేయడం చేస్తే ఆయా వర్గాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు విన్పిస్తున్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- ఇక రెండు శ్లాబ్‌ల్లోనే జీఎస్టీ వసూలు
- పేద, మధ్య తరగతి వర్గాల హర్షం
- జిల్లాలో 1.50 లక్షల మంది పాలసీదారులకు ఊరట
- రైతులకు చేకూరనున్న మేలు
- మందులు, ఏసీ, ఫ్రిజ్‌, కార్ల ధరల తగ్గుదల

స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ ప్రకటించిన విధంగానే పేదల నుంచి వివిధ వర్గాల ప్రజలకు జీఎస్టీ భారాలను దించేశారు. దీపావళి నాటికి జీఎస్టీ శ్లాబ్‌లను రెండు తొలగిస్తారన్న అంశంపై జీఎస్టీ కౌన్సిల్‌ నెల రోజులకు ముందే ప్రకటించింది. వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలను ఈ నెల 22 నుంచి అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ ఆధ్వర్యంలో జీఎస్టీ కౌన్సిల్‌ బుధవారం పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 5,12,18,28 శాతంగా ఉన్న పన్నురేట్లలో 5, 18 పన్ను రేట్లు మాత్రమే రాబోయే రోజుల్లో వసూళ్లు చేపట్టనున్నారు. రెండు శ్లాబ్‌ల ఎత్తివేతతో జీఎస్టీ పన్నుల చెల్లించే వారి సంఖ్య పెరగడంతోపాటు వసూళ్లల్లో అధికారులకు డీలర్లు, వ్యాపారవేత్తల సహకారం పెరుగుతుందని ఏలూరు జిల్లావాసులు భావిస్తున్నారు.

నిత్యావసరాలపై ఊరట

నిత్యావసరాలైన పాలు, పనీర్‌, బిస్కెట్లు సబ్బులు, షాంపూలు నుంచి మధ్య, ఉన్నత వర్గాల వరకు ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, చిన్నకార్లు, బైకుల వరకు ధరలు దిగివస్తాయి. నిత్యం వాడే తలనూనెలు, షాంపూలు, టూత్‌పేస్టులు టూత్‌ బ్రష్‌, షేవింగ్‌ క్రీమ్‌లు, డెయిరీ ఉత్పత్తులైన వెన్న, నెయ్యి, జున్ను, డెయిరీ స్ప్రెడ్‌, చిన్నారులు వాడే ఫీడింగ్‌ బాటిళ్లు, బేబి నేప్కిన్లు, డైపర్లపై 12 నుంచి 5 శాతానికి తగ్గించారు. హానికర, విలాస వస్తువులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధింపు జరుగుతుంది.

వ్యవసాయానికి చేయూత

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్‌, ట్రాక్టర్‌ టైర్లు, విడిభాగాలు, డ్రిప్‌ ఇరిగేషన్‌, స్ప్రింకర్లపై జీఎస్టీ తగ్గించారు. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఈ తగ్గింపు జిల్లాలోని డెల్టా, మెట్ట, ఏజెన్సీ రైతులకు మేలు చేకూర్చనుంది.

ఆటో మొబైల్‌ రంగానికి జవసత్వాలు

వివిధ రకాల కార్లు, హైబ్రీడ్‌ కార్లు, త్రిచక్ర వాహనాలు, 350 సీసీలోపు ఉండే మోటార్‌ సైకిళ్లు, రవాణా వాహనాలకు 28 నుంచి 18 శాతానికి పన్ను రేట్లు తగ్గించడంతో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు కొనుగోలుదారులకు బెనిఫిట్‌ జరిగే అవకాశం ఉంది.

ఉపకరణాల కొనుగోలుకు ఉత్తేజం..

28 శాతం శ్లాబ్‌లో ఉన్న ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీల ధరలు కనీసంగా రెండు నుంచి రూ.10 వేలకు తగ్గే అవకాశం ఉంది. ఇకపై 18 శాతాన్ని ఈ ఉపకరణాలపై వసూలు చేయనుండడంతో వీటి అమ్మకాల్లో వృద్ధి పెరగనుంది. ఈ శ్లాబ్‌లో (మిగతా 6వ పేజీలో)

పాలసీదారులకు ఉపయుక్తం



జీవిత బీమా పాలసీలు చేసే వినియోగదారులు జీఎస్టీ భారంతో చాలాకాలంగా అతలాకుతలం అయ్యారు. పాలసీ ప్రారంభించినప్పుడు మొదటి ఏడాది 12 శాతం, రెండో ఏడాది 4.5 శాతం సింగిల్‌ ప్రీమియం, ట్రెడిషనల్‌ పాలసీలపై జీఎస్టీ వడ్డన జరిగింది. దీంతో వారు కట్టే ప్రీమయం రాబోయే రోజుల్లో వందల్లో తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. 2020 నుంచి పాలసీ దారుల సంక్షేమ కోసం ఎల్‌ఐసీ ఏజెంట్లుగా మేము పెద్ద ఎత్తున ఉద్యమించాం. ఆ ఫలితంగా వినియోగ దారులకు జీఎస్టీ భారం ఎత్తివేయడం ముదావహం.జిల్లాలోని నాలుగు బ్రాంచ్‌ల పరిధిలో లక్షా 50వేల మంది లబ్ధి పొందుతారు.

- సుధాబత్తుల శ్రీనివాస్‌, ఎల్‌ఐసీ ఏజెంట్ల యూనియన్‌ సీనియర్‌ జనరల్‌ సెక్రటరీ

మళ్లీ పెరిగిన గోదావరి

పోలవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి మళ్లీ పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,31,017 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43.10 మీటర్లకు పెరిగింది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.350 మీటర్లు, దిగువన 23.740 మీటర్లు నమోదైనట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో అత్యధికంగా టి.నరసాపురం మండలంలో 21 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6.3 మి.మీగా నమోదైంది. వేలేరుపాడు 19.8, ద్వారకాతిరుమల 16.4, కైకలూరు 15.4, చాట్రాయి 12.8, దెందులూరు 12.6, కామవరపుకోట 12.4, కలిదిండి 8.6, పోలవరం 8.4, కుక్కునూరు 15.4, పెదపాడు 7.2, నిడమర్రు 7, ఆగిరిపల్లి 6.8, నూజివీడు 3.4, లింగపాలెం 3.2, భీమడోలు 2 మి.మీ వర్షపాతం నమోదైయింది.



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్‌ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

రైతుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

- కోకో రైతుల సంఘం గౌరవాధ్యక్షుడు ఏబీ వెంకటేశ్వరరావు

పెదవేగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రైతుల్లో ఐక్యత లేకపోవడంతో సమస్యలు పరిష్కారం సాధ్యం కావడంలేదని విశ్రాంత ఐపీఎస్‌ అధికారి, కోకో రైతుల సంఘం గౌరవాధ్యక్షుడు ఏబీ.వెంకటేశ్వరరావు అన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో గురువారం జరిగిన కోకో రైతుల రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ కోకో రైతులు రాష్ట్ర వ్యాప్తంగా సంఘటితం కావాల్సిన అవశ్యకత ఉందన్నారు. రైతుల పోరాట ఫలితంగా కిలో కోకో గింజలకు రూ.500 ధర ఇచ్చారని, అయితే ఇందులో ప్రభుత్వం రూ.50లు ప్రోత్సాహకం ఉందని, అంతర్జాతీయ మార్కెట్‌ ధర వచ్చేలా ప్రభుత్వం ప్రయత్నించకుండా కొనుగోలు సంస్థలకు లొంగుబాటుగా ప్రోత్సాహకం ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. ఈ తరుణంలో తమ పంటను రైతులే నేరుగా విక్రయించుకునేలా ఫార్మర్‌ ప్రొడ్యూసర్‌ ఆర్గనైజేషన్‌ ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోకో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. సీపీసీఆర్‌ఐ కాసరగోడ్‌ మాజీ డైరెక్టర్‌ డాక్టర్‌ పి.చౌడప్ప మాట్లాడుతూ కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో క్యాంప్‌ కో సొసైటీని ఏర్పాటు చేసుకుని కోకో రైతులు లాభపడ్డారన్నారు. నాబార్డు ఏజీఎం ఎం.రాజశేఖర్‌ రెడ్డి, ఉద్యానశాఖ సంయుక్త సంచాలకుడు మునిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్‌ ఎస్‌.రామ్మోహన్‌, ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్‌, కొబ్బరి రైతుల ప్రాంతీయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, పెదవేగి ఆయిల్‌పామ్‌ రైతుల సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, కోకో రైతుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మైనర్‌ చెరువుల పునరుద్ధరణ : కలెక్టర్‌

ఏలూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 1,513 మైనర్‌ ఇరిగేషన్‌ చెరువుల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని, భూగర్భజలాల వివరాలతో కూడిన సెప్టెంబరు బులెటిన్‌ రూపొందిస్తున్నట్టు కలెక్టర్‌ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు తెలిపారు. కలెక్టర్లతో గురువారం సీఎస్‌ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించి యూరియా లభ్యత, ధర నిర్ణయం, పీఎం కుసుమ్‌లపై సమీక్షించారు.

కేసు పరిష్కారానికి 41 ఏళ్లు

- భూసేకరణలో భార్యాభర్తలకు చెరో రూ.రెండున్నర లక్షలు చెల్లింపు

■ లోపలి పేజీలో..

నూజివీడుకు చేరిన సాగర్‌ నీరు

నూజివీడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం రావిచర్ల వద్ద ఉన్న బాపులపాడు మేజర్‌ కాలువ 0.000 కి.మీ రెగ్యులేటర్‌ వద్దకు గురువారం సాగర్‌నీరు చేరింది. ఈ రెగ్యులేటర్‌ నుంచి దిగువకు విడుదల అవుతున్న సాగర్‌జలాలను గురువారం ఉదయం సాగర్‌ ఎడమకాలువ ప్రాజెక్ట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ ఆళ్ళ గోపాలకృష్ణ, నీటిసంఘాల అధ్యక్షులు, సాగర్‌ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌ డ్యామ్‌ నుంచి కిందకు విడుదల అవుతున్న వరద జలాలను సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వ కోరిక మేరకు తెలంగాణ ప్రభుత్వం మూడోజోన్‌కు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిందన్నారు. అవి 300 కి.మీలు ప్రయాణించి ఈ ప్రాంతానికి చేరుకున్నాయని, వీటితో నూజివీడు మేజర్‌కాలువ పరిధిలోని పలు చెరువులకు నీరు అందుతుందన్నారు. బాపులపాడు మేజర్‌కు 60 క్యూసెక్కులు మాత్రమే వస్తోందని, ఎగువ ప్రాంత సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులతో సమన్వయం చేసుకుని నీటి డిశ్చార్జ్‌ని పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. నీటిసంఘాల అధ్యక్షులు పల్లగాని వెంకట నాగేంద్ర, తమ్మిశెట్టి రాంబాబు, రావిచర్ల సర్పంచ్‌ కాపా శ్రీనివాసరావు, నూజివీడు ఎన్‌ఎస్‌పి డీఈ కె.సీతారావమ్మ, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నూజివీడుకు చేరిన సాగర్‌నీటిని పరిశీలిస్తున్న ప్రాజెక్ట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ గోపాలకృష్ణ, తదితరులు

సిద్ధంకండి!



స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు సమాయత్తం

- 2026 జనవరి నుంచి పంచాయతీలకు, జూలై నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు
- ఎన్నికల కమిషన్‌ ప్రీ ఎలక్షన్‌ షెడ్యూల్‌ విడుదల

ఏలూరుసిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఎన్ని కల కమిషన్‌ ప్రీ ఎలక్షన్‌ షెడ్యూల్‌ను విడుదల చేసింది. స్థానిక సంస్థలలో ముందుగా కార్పొరేషన్‌/మునిసిపాలిటీలు/నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని, 2026 జనవరి నుంచి గ్రామ పంచాయతీలకు, 2026 జూలై నుంచి ఎంపీటీసీ/జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ పేర్కొంది. ఈ ప్రకారం చూస్తే సకాలంలోనే పంచాయతీలకు, ఎంపీటీసీలు/జడ్పీటీసీలకు ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

2020, ఫిబ్రవరిలో నాలుగు విడతలుగా అప్పటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 907 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 2020, ఫిబ్రవరి 21తో ఎన్నికలు పూర్తయ్యాయి. ఆ తర్వాత 2021 మార్చిలో 876 ఎంపీటీసీలు, 48 జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే కొన్ని కారణాల వల్ల సెప్టెంబరులో ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. ఆ తరువాతే ఎంపీపీ, జిల్లా పరిషత్‌లకు పాలక వర్గాలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత జిల్లాల విభజన జరిగింది. అయితే ఏ జిల్లాకు ఆ జిల్లాకు పంచాయతీలు విభజన జరగ్గా, ఎంపీటీసీలు/జడ్పీటీసీలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఉంచారు. ఇప్పుడు 2026 జూలైలో ఎంపీటీసీ/ జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల కమిషన్‌ సూచించింది. ఇక జిల్లాలు విభజన జరిగిన తర్వాత ఏలూరు జిల్లాలో 547 పంచాయతీలు, 27 మండలాలు ఉన్నాయి. మళ్లీ అక్టోబరులో జిల్లాల విభజన జరుగుతుందని చెబుతున్నారు. అయితే పాత పద్ధతి ప్రకారం జిల్లాలోని 547 పంచాయతీలకు సంబంధించి ముందస్తు ఎన్నికల ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

ప్రీ ఎన్నికల షెడ్యూలు ఇలా..

డీలిమిటేషన్‌, రిజర్వేషన్ల ప్రక్రియను అక్టోబరు 15లోగా పూర్తి చేసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేయాలని ఎన్నికల కమిషన్‌ విడుదల చేసిన ప్రీ ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొంది. ఆ ప్రకారం పంచాయతీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. నవంబరు ఒకటి నుంచి 15 వరకు రిటర్నింగ్‌ అధికారుల నియామకం, నవంబరు 16 నుంచి పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నవంబరు 30 తేదీలోగా ఎన్నికల కసరత్తు పూర్తి చేసుకుని డిసెంబరు 15వ తేదీలోగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాల విభజన జరిగితే ప్రస్తుతం ఉన్న జిల్లాల స్వరూపాలు మారిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఏ స్థానిక సంస్థలో అయినా పదవీకాలం ముగిసేలోగానే ఆరు నెలల ముందే ఎన్నికల సన్నాహాలు చేస్తారు. ఆ ప్రకారమే స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ముగిసే ముందుగానే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు. అందుకే ఎన్నికల కమిషన్‌ ముందస్తు ఎన్నికల ఏర్పాట్లుకు షెడ్యూల్‌ విడుదల చేసిందని చెబుతున్నారు.

రాజకీయ పార్టీలలో ఎన్నికల వేడి

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ ముందస్తు ఎన్నికల షెడ్యూల్‌ విడుదల చేయడంతో రాజకీయ పార్టీలలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్‌లకు పోటీ చేసే ఆశావహులు ప్రజలకు ఆకర్షించడానికి వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ పార్టీల నాయకులతో చర్చలు జరిపే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైందని చెప్పవచ్చు.

వార్డులు పెరిగేనా?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పురపాలక, కార్పొరేషన్ల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్న ఆదేశాలతో ఆయా సంఘాల్లో సన్నాహాలు త్వరలో మొదలు కానున్నాయి. వచ్చే ఏడాది మార్చి నెలలో పాలకవర్గాల గడువు ముగియనుంది. ఏలూరు కార్పొరేషన్‌, జంగారెడ్డిగూడెం, నూజివీడు మునిసిపాలిటీలకు మాత్రమే పాలక వర్గాలున్నాయి. చింతలపూడి నగర పంచాయతీగా ప్రకటించాక రాష్ట్రవ్యాప్తంగా నగర పంచాయతీలకు ఎన్నికలు జరపలేదు. దీంతో అప్పటి నుంచి ఇక్కడ స్పెషలాఫీసర్‌ పాలనే సాగుతోంది. కోర్టు స్టే తొలగి ఈ దఫా ఎన్నికలు జరుగుతాయా.. అన్నది ప్రశ్నగానే ఉంది. మరోవైపు మూడు నెలలు క్రితం చింతలపూడి నగర పంచాయతీ అప్‌గ్రేడ్‌ అయింది. ఇక ఇక్కడ రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ ప్రక్రియను అక్టోబరు 15లోగా పూర్తి చేయాల్సి ఉంది. మరోవైపు జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీని గ్రేడ్‌-1 ప్రకటించాల్సి ఉంది. ఎన్నికల ముందే ఈ ప్రకటన వెలువడుతుందా? అన్న ఆసక్తి నెలకొంది. ఇక్కడ 29 వార్డులున్నాయి. జనాభా ప్రాతిపదికన మరో మూడు వార్డులు పెరుగుతాయని, దీనికి అనుగుణంగానే డీలిమిటేషన్‌ ప్రక్రియ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు నూజివీడు మునిసిపాలిటీనూ ఎంఆర్‌ అప్పారావు నగర్‌ కాలనీని ఒక వార్డుగా విభజన చేయాలని అక్కడ వారు కోరుతున్నారు. దీనిని ఒక వార్డు డీలిమిటేషన్‌ చేసే వీలుంది. దీంతో ఇప్పుడున్న 29 వార్డుల సంఖ్య 30కు చేరే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణపై ఆయా కమిష నర్లను పలుకరించగా అధికారికంగా ఏర్పాట్లపై తమకేమి ఆదేశాలు అందలేదన్నారు. మరోవైపు మూడు నెలలు ముందుగానే పురపాలక, కార్పొరేషన్ల ఎన్నికలకు ముహూర్తం పెట్టడానికి సిద్ధం కావడంతో పురపాలక సంఘాల్లో ఇప్పటి నుంచే నేతలు పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారు.

ఇదేంటి మాస్టారు..?



- వివాదాస్పదమైన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక
- పోలీసు ఎంక్వయిరీ షరతుపై ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం
- టీచర్లను అగౌరవపర్చారు : ఫ్యాప్టో
- 25 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు
- ఇద్దరు హెచ్‌ఎంలకు తిరస్కారం
- నేడు ఏలూరులో గురు పూజోత్సవం

ఏలూరు అర్బన్‌, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):గురుపూజోత్సవ వేళ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపిక, తుది ఆమోదముద్ర విషయంలో గురువారం హైడ్రామా నడిచింది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన టీచర్ల ఖరారు, తుది జాబితాపై ఉన్నతాధికారుల ఆమోదముద్ర ఒకరోజు ముందుగానే జరగడం సహజం కాగా, ఈ ఏడాది భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాస్థాయి పురస్కారాలకు ఎంపికైన 25 మంది టీచర్లపై క్రిమినల్‌ కేసులు, నేరచరిత్ర లేవని పోలీసుశాఖ నుంచి ధ్రువీకరణను కోరడం అటు ఉపాధ్యాయుల్లోను, ఇటు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సభ్య సంఘాల్లోను తీవ్ర అభ్యంతరాలు, ఆగ్రహం వ్యక్తమయ్యాయి. పలు పరిణామాల అనంతరం గురువారం రాత్రి 8 గంటల సమయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైనవారి జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. గురువులను గౌరవించాల్సిన రోజున వారిని పోలీసు క్లియరెన్స్‌ పేరిట అవమానపర్చేలా వ్యవహరించారని ఫ్యాప్టో నాయకులు విమర్శించారు.

అసలు ఎందుకిలా..

వాస్తవానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అందజేసే దరఖాస్తుతో పాటే సంబంధిత టీచరు తనపై ఎటువంటి క్రిమినల్‌ కేసులు లేవని ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి పురస్కారాలకు గతంలో ఇటువంటి నిబంధనలేవీ లేవని చెబుతున్నారు. ఈ దఫా అర్హతలు, ఎంపికలకు తోడు పోలీసు క్లియరెన్స్‌ను అమలు చేయాలని చివరి నిమిషంలో షరతు పెట్టారు. పోలీసు క్లియరెన్స్‌(ఎంక్వయిరీ) అంశం బుధవారమే తెరపైకి రాగా క్షేత్రస్థాయిలో టీచర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. క్లియరెన్స్‌ సర్టిఫికెట్‌ను మీసేవా కేంద్రాల నుంచి తెచ్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించినట్టు తెలుస్తోంది. ఒకదశలో పోలీసు క్లియరెన్స్‌ సర్టిఫికెట్‌ అవసరం లేదని విద్యాశాఖ వర్గాలు స్పష్టం చేశాయి. దీనికి భిన్నంగా గురువారం ఉదయం పోలీసు క్లియరెన్స్‌ను తప్పనిసరి చేయడంతో రాత్రివరకు డైలమా, ఉపాధ్యాయ సంఘాల నుంచి అభ్యంతరాలు కొనసాగాయి. పోలీసు క్లియరెన్స్‌ లభించిన తర్వాతే అవార్డులకు ఎంపికైన టీచర్ల జాబితాకు ఆమోదముద్ర పడినట్టు ప్రచారం జరుగుతోంది.

టీచర్లను అగౌరవపర్చడమే : ఫ్యాప్టో

అర్హతలు గల ఉపాధ్యాయులనే ఎంఈవోలు, డీవైఈవోలు ఎంపికచేసి దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపగా, వాటిని డీఈవో నియమించిన అవార్డుల కమిటీ పరిశీలన అనంతరమే తుదిజాబితాను తయారు చేశారని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్‌ జి.మోహన్‌, సెక్రటరీ జనరల్‌ ఎం.ఆదినారాయణ తెలిపారు. పోలీసు ఎంక్వయిరీ చేసిన తర్వాతే తుదిజాబితాను ప్రకటించాలని జిల్లా ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఉపాధ్యాయలోకాన్ని అవమానపర్చడమేనని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా ఈ జిల్లాలోనే జరిగిందని ఆరోపించారు. టీచర్లను అగౌరవ పరిచే, వారి మనోభావాలను గాయపరిచే ఇటువంటి చర్యలను ఖండిస్తున్నట్టు ఫ్యాప్టో జిల్లా నాయకులు జి.వెంకటేశ్వరరావు, ఆర్‌.రవికుమార్‌, సీహెచ్‌ శివరామ్‌, ఐ.రమేష్‌, టి.రామారావు, కె.పవన్‌ కుమార్‌, ఇ.రామ్మోహన్‌, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.మురళీకృష్ణ, జె.రవీంద్ర తెలిపారు.

33 మందికి పురస్కారాలు

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకున్న 25మంది టీచర్లకూ అవార్డులు దక్కాయి. వీరిలో 15 మంది స్కూల్‌ అసిస్టెంట్‌ కేటగిరీ, 10 మంది ఎస్జీటీ కేటగిరీ ఉపాధ్యాయులున్నారు. మరో ఇద్దరు ప్రధానోపాధ్యాయులను ఫెలోషిప్‌ పురస్కారాల కింద సంబంధిత హైస్కూళ్ల టీచర్లు నామినేట్‌ చేసినప్పటికీ చివరినిమిషంలో నిబంధనల మాటున వారిద్దరి పేర్లను జాబితా నుంచి తొలగించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా అవార్డులకు ఎంపికైన 25 మందితో పాటు, హాకీ లెజెండ్‌ ధ్యాన్‌చంద్‌ పుట్టినరోజును పురస్కరించుకుని నేషనల్‌, స్టేట్‌, ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ లెవెల్‌ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్కూల్‌ ఆఫ్‌ స్పోర్ట్స్‌ ఎక్సలెన్స్‌-2025 అవార్డులను సంబంధిత (మిగతా 6వ పేజీలో)

నేడు ఏలూరు జడ్పీ మీటింగ్‌ హాలులో అవార్డుల అందజేత

గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఏలూరు జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి అధ్యక్షత వహిస్తారని, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్‌, కలెక్టర్‌, తదితరులు పాల్గొంటారన్నారు. ఎంపికైన వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేస్తామని తెలిపారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

• స్కూల్‌ అసిస్టెంట్‌ కేటగిరీ..

బత్తుల అనూరాధ, బయోలాజికల్‌ సైన్స్‌, జడ్పీహెచ్‌ఎస్‌, నూజివీడు. వల్లటూరి వెంకట సీతారామప్రసాద్‌, పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్‌, నూజివీడు. నక్కా సరళకుమారి, ప్రైమరీ స్కూలు హెచ్‌ఎం, ఎంపీఎస్‌ ఏపూరు, పెదపాడు మండలం. మర్రిపాటి పద్మావతి, ఫిజికల్‌ డైరెక్టర్‌, జడ్పీహెచ్‌ఎస్‌, కలరాయనగూడెం, లింగపాలెం మండలం. పంతగాని వీరకోటి, బయోలాజికల్‌ సైన్స్‌, జడ్పీహెచ్‌ఎస్‌, చనుబండ, చాట్రాయి మండలం. పంతగాని సౌమ్య, ఇంగ్లీషు, జడ్పీహెచ్‌ఎస్‌, నారాయణపురం, ఉంగుటూరు మండలం. పొలిమెట్ల యానీమేరీ సమాదాన పద్మావతి, ఫిజికల్‌ సైన్స్‌, సెయింట్‌ థెరిస్సా బాలికోన్నత పాఠశాల, ఏలూరు. వీవీఎస్‌ సత్యనారాయణ, ఫిజికల్‌ సైన్స్‌, జడ్పీహెచ్‌ఎస్‌, ధర్మాజీగూడెం, లింగపాలెం మండలం. వి.శ్రీనివాసరావు, ఫిజికల్‌ సైన్స్‌, జడ్పీహెచ్‌ఎస్‌, రామసింగవరం, పెదవేగి మండలం, జె.రామకృష్ణ, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌, జడ్పీహెచ్‌ఎస్‌, రామసింగవరం, పెదవేగి మండలం. ఎంఎల్‌కే శ్రీనివాసరావు, ఇంగ్లీషు, ఎంపీయూపీఎస్‌, చింతపల్లి, చింతలపూడి మండలం. షేక్‌ రంగావలి, ఇంగ్లీషు, జడ్పీహెచ్‌ఎస్‌, తోకలపల్లి, నిడమర్రు మండలం. ఆర్‌.వెంకట నాంచారయ్య, ఫిజికల్‌ సైన్స్‌, దొడ్డిపట్ల, కైకలూరు మండలం. టి.వెంకటఅప్పారావు, ఇంగ్లీషు, జడ్పీహెచ్‌ఎస్‌, పుట్లచెరువు, మండవల్లి మండలం. ఎ.అప్పారావు, ప్రైమరీస్కూలు హెచ్‌ఎం, ఎంపీపీఎస్‌-1, నిడమర్రు.

• ఎస్జీటీ కేటగిరీ..

సరాల మహదేవి స్వర్ణ, ఎంపీఎస్‌, పాతూరు, కామవరపుకోట మండలం. సీహెచ్‌.కుసుమ కుమారి, ఎంపీపీఎస్‌, చావలిపాడు, మండవల్లి మండలం. డీకెఎస్‌ఎస్‌ ప్రకాష్‌రావు, ఎంపీపీఎస్‌, తిమ్మారావుగూడెం, ఏలూరు మండలం. ఎం.శ్రీనివాసరావు, ఎంపీపీఎస్‌, లింగాల(ఎఫ్‌ఎస్‌), మండవల్లి మండలం. పి.రాజ్యలక్ష్మి, ఎంపీయూపీఎస్‌, వెలమపేట, కైకలూరు మండలం. డి.గంగానమ్మ, ఎంపీపీఎస్‌, వేంపాడు, నూజివీడు మండలం. ఎస్‌.నాగేశ్వరరావు, ఎంపీయూపీఎస్‌, మఠంగూడెం, లింగపాలెం మండలం. ఐ.ఎం నిర్మలకుమారి, ఎంపీపీఎస్‌, వెంకంపాలెం, చింతలపూడి మండలం. ఎ.వెంకటేశ్వరరావు, ఎంపీఎస్‌, ఈదులగూడెం, అగిరిపల్లి మండలం. ఒ.ఆనందకుమార్‌, ఎంపీపీఎస్‌-1, కాగుపాడు, ఉంగుటూరు మండలం.

మా మంచి మాస్టార్లు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఉత్తమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు. భవిష్యత్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, వైద్యులు, అఖిల భారత సర్వీసు ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు, దేశాన్ని పాలించే నేతలను సైతం తయారు చేసేది ఉపాధ్యాయులే.. సమాజం ఇంతటి కీలక బాధ్యతలు నిర్వహించే భవిష్యత్ ఉపాధ్యాయులను తయారు చేసేది కూడా వారే. బోధనలో వినూత్న శైలి.. వెనుకబడిన విద్యార్థులను చదువులో రాణించేలా తీర్చిదిద్దడం వారి బాధ్యత. అదే సమయంలో పేద విద్యార్థులకు బాసటగా నిలిచేవారు కొందరు. చదువుల్లో ముందున్న వారిని ప్రోత్సహించే ఉపాధ్యాయులు మరికొందరు. విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టి తల్లిదండ్రులకు అవగాహన కలిగించే టీచర్లు ఇంకొందరు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బోధనలో రాణించడంతో పాటు ప్రతిభ కనబరుస్తున్న పలువురు ఉపాధ్యాయుల పరిచయం.

చదువుల వెలుగు పోతురాజు మాస్టారు


తరగతి బోధనలో పోతురాజు మాస్టారు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆయన పుట్టుకతోనే అంధుడు. చదువుపై చిన్నతనం నుంచి ఆసక్తి. చూపు లేకపోయినా చదువే వెలుగు ఇస్తుందని బలంగా నమ్మారు. పట్టుదలతో చదివి గురువు స్థానం అధిష్టించారు. చూపు లేకున్నా భవిష్యత్ తరానికి కూడా వెలుగు అందిస్తున్నారు. శ్రీనివాసపురానికి చెందిన మల్లాబత్తుల పోతురాజు, తల్లిదండ్రులు సీత, రాములు, సోదరుడు కూడా అంధులే. పోతురాజు ఆరో తరగతి వరకు ఇక్కడే చదివాడు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు హైదరాబాద్ దారుసెఫా బ్లైండ్ హైస్కూల్‌లో బ్రెయిలీ లిపిలో చదివారు. అక్కడే ఇంటర్, బీఏ, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీఈడీ పూర్తి చేశారు. 2011 డీఎస్సీలో ఎస్జీటీగా ఉద్యోగం సాధించారు. 13 ఏళ్లుగా స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు, పరిసరాల విజ్ఞానం టెస్ట్ బుక్స్‌లోని సబ్జెక్టులను బ్రెయిలీ లిపిలోకి తర్జుమా చేయించి అనంతపురంలోని ఆర్డీటీ బ్రెయిలీ లిపి ప్రెస్‌లో ముద్రించుకుంటారు. ఈ పుస్తకాల ఆధారంగా పిల్లలకు పాఠాలు బోధిస్తారు. ఈ పుస్తకాల ఖర్చును తానే భరిస్తారు. పాఠాలు చెబుతున్నప్పుడు పిల్లలకు అర్థం అయ్యే వరకు వివరిస్తారు. వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. పిల్లలకు తమ ఉపాధ్యాయుడు అంధుడనే భావన రానీయరు. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి అంధత్వం ఆయనకు ఏమాత్రం అడ్డంకి కాలేదు. పుట్టిన ఊరిలోనే పదమూడేళ్లుగా పనిచేయడం సంతోషంగా ఉందంటారు. 2011లో ఆయన సేవలకు గాను ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందారు.

క్రీడాకారుల భవిష్యత్‌కు 'రాజు'బాట



ముసునూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సొంత ఖర్చుతో ప్రోత్సాహకాలను అందిస్తూ వారి భవిష్యత్‌కు బాట వేస్తున్నారు రమణక్కపేట జడ్పీ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వాకా నాగరాజు. బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, ఫెన్సింగ్ తదితర ఆటల్లో గ్రామీణ ప్రాంతమైన రమణక్కపేట పాఠశాల నుంచి అనేక మంది బాల, బాలికలు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలను సాధించేలా ఆయన కృషి చేశారు. అరకొర వసతులు, మట్టి కోర్టులోనే శిక్షణ, పీడీ నాగరాజు ప్రోత్సాహంతో గత ఏడాది నరసారావుపేట, మార్టేరు, శ్రీకాకుళం, రామచంద్రాపురం, నంద్యాల, తెనాలి, విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రస్థాయిలో పలు విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించేలా కృషి చేశారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, రవాణ ఖర్చులు, పోషకాహారం కోసం దాతలను ఆశ్రయిస్తారు. సొంత సొమ్ము కూడా వెచ్చించి క్రీడాకారుల భవిష్యత్ కోసం నాగరాజు శ్రమిస్తున్నారు.

సైన్స్ బోధనలో దిట్ట సుబ్బరాజు



నిడమర్రు సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సైన్స్ బోధనలో దిట్ట సుబ్బరాజు మాస్టారు. సుబ్బరాజు మాస్టారి పాఠం వింటే మళ్లీ తిరిగి చదవాల్సిన పనిలేదంటారు ఆయన విద్యార్థులు. 17 ఏళ్ల సర్వీసులో ఆయన శిక్షణతో 30 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించారు. ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మానసికంగా, మేధోపరంగా, ఆర్థికంగా ఎన్నో సేవలందించారు. ప్రతి నెల తన జీతం నుంచి రూ.20 వేల వరకు వివిధ సైన్స్ ప్రాజెక్టులు, పిల్లల కోసం ఖర్చుపెట్టడం ఆయనకు ఆనవాయితీ. 2010లో పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా చేరిన ఆయన తర్వాత చిననిండ్రకొలను పాఠశాలకు బదలీ అయ్యారు. సైన్స్ అనేది ఒక సబ్జెక్టు మాత్రమే కాదని ఒక జీవన ప్రమాణం అని ఆయన చెబుతారు.

మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఏ సైన్స్ ప్రదర్శనలో ఆయన విద్యార్థులు పాల్గొంటే కచ్చితంగా బహుమతి సాధిస్తారు. ప్రాజెక్టు ఎంపిక నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించి తయారుచేసి ప్రదర్శించేవరకు శ్రద్ధ వహిస్తారు. ఆయన ప్రాజెక్టుల జాతీయస్థాయిలో ఒకసారి, రాష్ట్ర స్థాయిలో ఏడు సార్లు ప్రదర్శించారు. 2016లో పుదుచ్చేరి లో జరిగిన జాతీయ పదర్శనలో మూడో బహుమతి సాధించారు. పాఠశాల బోధనా సయమం అనంతరం విద్యార్థులను చెకుముకి, పాలిసెట్, ఏపీఆర్జేసీ, ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఆయన విద్యార్థులు ఎంతోమంది పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీతో పాటు ఐఐటీ, ఐఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో సీట్లు సాధించారు.

సొంత ఖర్చుతో సైన్స్ ల్యాబ్

పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో సుబ్బరాజు సైన్స్ ఉపాధ్యాయుడిగా చేరే సమయానికి ఆ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. అప్పుడు సుబ్బరాజు మాస్టారు తన సొంత నిధులతో ల్యాబ్‌కు కావల్సిన పరికరాలు, రసాయనాలు కొనుగోలు చేసి విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. విద్య ద్వారానే ఉన్నత స్థితికి చేరవచ్చని ఆయన విద్యార్థులను ప్రోత్సహిస్తారు. వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వహించడానికి విద్యార్థులతో పాటు సహచర ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సహకరిస్తున్నారని, వారి ప్రోత్సాహంతో విద్యార్థులను తీర్చిదిద్దగలిగానని సుబ్బరాజు మాస్టారు తెలియజేస్తున్నారు.


సృజనాత్మక బోధనలో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం నారాయణ


బోధన సామగ్రితో పాఠ్యాంశాలు చెబుతున్న టీచర్ వర్ధిని

వినూత్న బోధనా పద్ధతులు వారి సొంతం

ఆకివీడు సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వినూత్న పద్ధతిలో బోధించడం వారి ప్రత్యేకత. మూడు భాషలలో విద్యా బోధన జరుగుతుంది. ఆకివీడు పట్టణం 2వ వార్డు పాఠశాలలో హెచ్ఎం ఆర్వీఎస్ నారాయణ (విక్రమ్), ఉపాధ్యాయిని వెలగపల్లి వర్ధిని వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. విక్రమ్ 4, 5 తరగతుల విద్యార్థులకు అభ్యాసన ఉపకరణాల సహాయంతో పాఠ్యాంశాలు బోధిస్తారు. నిజ జీవితంలో సంఘటనలు మేళవించి పాఠ్యాంశాల బోధన అద్భుతం. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు కూడా నేర్పుతున్నారు. విద్యార్థులు వినడం, పఠన, రాయడం, భాషణ నైపుణ్యంలో అద్భుతమైన విజయాలు సాధించారు. ఉపాధ్యాయిని వెలగపల్లి వర్ధిని 1, 2, 3 తరగతులకు బోధనా సామగ్రి ఉపయోగించి పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. అభ్యసన ఉపకరణాలు ఉపయోగిస్తూ ఆట, పాటలతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. వారి వినూత్న బోధనా శైలితో ఏ,బీ,సీ గ్రేడ్ విద్యార్థులు పాఠ్యాంశాలు సులభంగా అవగాహన చేసుకుంటున్నారు. ఈ పాఠశాలలో బట్టీ విధానానికి తావులేదు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, పట్టణస్థులు, యాజమాన్య కమిటీ చైర్మన్ మజ్జి రాజేశ్వరి, సభ్యులు గురువుల బోధనా తీరును అభినందిస్తారు.

బోధనలో శాస్త్రి మాస్టారు విభిన్నశైలి


పదో తరగతి విద్యార్థులకు లెక్కలు బోధిస్తున్న హెచ్ఎం ప్రభాకరశాస్త్రి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఎం బాలికల హైస్కూల్ హెచ్ఎం యనమండ్ర ప్రభాకర శాస్త్రి బోధనలో విభిన్న శైలి అవలంబిస్తారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు లెక్కలు, ఇంగ్లీషుల్లో విద్యార్థులకు సులభతరంగా, అర్థమయ్యేవిధంగా బోధించడం ఆయన ప్రత్యేకత. ఏ పాఠశాలలో పనిచేసిన ఆపాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తారు. లెక్కల్లో నూటికి నూరు మార్కులు వచ్చేవిధంగా మంచి బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. గత 6 ఏళ్లుగా 10వ తరగతి పరీక్షల్లో శాస్త్రి పనిచేసే హైస్కూల్లో లెక్కల, ఇంగ్లీషుల్లో ఫెయిలైనా విద్యార్థులు లేరంటే అతిశయోక్తి కాదు. లెక్కల బోధనలో కూడా అనేక చమత్కారాలతో చెప్పి విద్యార్థులను ఆకట్టుకుంటారు. ఇంగ్లీషులో విద్యార్థులతో లెటర్లు రాయించడం, మాట్లాడించడం, లాంగ్వేజ్ గేమ్స్‌తో బోధిస్తారు. విద్యార్థులు కూడా చక్కగా శాస్త్రి మాస్టారు అంటూ సంబోధించి తమ తండ్రిగా భావిస్తారు. పాలకొల్లులోని పలు సేవా సంస్థలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించాయి. 2017లో జాతీయ స్థాయిలో స్వచ్ఛ విద్యాలయం అవార్డును ఢిల్లీలో అందుకుని పాలకొల్లు కీర్తిని జాతీయ స్థాయిలో నిలిపారు శాస్త్రి మాస్టారు.


బొమ్మలతో పాఠాలు చెబుతున్న అప్పారావు మాస్టారు, బొమ్మతో విద్యార్థి

బొమ్మల పాఠాల పొట్నూరి

పోలవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కొంత మంది గురువులనే గుండెల్లో నిలుపుకుని పూజిస్తారు. ఆ కోవకు చెందిన ఉపాధ్యాయుడు పోలవరం మండలం కార్మెల్‌పురం పాఠశాల ఉపాధ్యాయుడు పొట్నూరి అప్పారావు. ఆయన ఏ పాఠశాలకు వెళ్లినా పాఠ్య పుస్తకాల్లో బొమ్మలను మట్టి, అట్ట ముక్కలతో తయారుచేసి వాటితో పాఠాలు బోధిస్తారు. తాను తయారుచేసే బోధనా బొమ్మలకు సొంత సొమ్ము వినియోగిస్తారు. పాఠశాలలో సొంత ఖర్చుతో కంప్యూటర్ ఏర్పాటుచేసి విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి కంప్యూటర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల నమూనాలను అట్టముక్కలతో తయారుచేసి, అక్కడి అధికారులు, విధులు, ఇతర సమాచారం విద్యార్థులకు వివరిస్తారు. మాస్టారి బోధనా పద్ధతులు చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలలో చేర్పడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నలుగురైదుగురు విద్యార్థులున్న పాఠశాలలో అప్పారావు మాస్టారు రాకతో 20 మంది చేరారు. ఉపాధ్యాయ వృత్తిపై మాస్టారి అంకితభావం అభినందనీయం.

నాగేశ్వరరావు ఆటల పాఠాలు


విద్యాబోధన చేస్తున్న హెచ్ఎం నాగేశ్వరరావు

చాట్రాయి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతో పాటు పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత. పచ్చదనం పరిశుభ్రత నిండిన ఆహ్లాదకర వాతావరణంలో ఆట పాటల ద్వారా వినూత్న పద్ధతులతో విద్యా బోధన చేసి అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు చాట్రాయి మండలం పోలవరం కోనేరు రంగారావు కాలనీ పాఠశాల హెచ్ఎం, రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత రాయపూడి నాగేశ్వరరావు. ఆయన పనిచేసిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలలో ప్రతిభావంతులు, ఉన్నత విద్యావంతులుగా ఎదిగారు. మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. నాగేశ్వరరావు రూ.80 వేలు సొంత నిధులు ఖర్చు చేసి ఇప్పుడు పనిచేస్తున్న పాఠశాలకు పెయింటింగ్స్, బొమ్మలు వేయించి అందంగా తీర్చిదిద్దారు. గతంలో పనిచేసిన పాఠశాలలో వేలాది రూపాయలు ఖర్చు చేసి కంప్యూటర్లు, ఇతర సదుపాయాలు కల్పించారు. తోటి ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేస్తూ మంచి ఫలితాలు సాధిస్తూ తల్లిదండ్రుల అభిమానాన్ని అధికారుల ప్రశంసలు పొందుతున్నారు. ఆయన ఏ స్కూల్‌కు వెళితే ఆ పాఠశాలకు మహర్దశ వస్తుందని తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల నమ్మకం. 1989లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నాగేశ్వరరావు పోతనపల్లి, తుమ్మగూడెం, ఆరుగొలనుపేట, బూరుగుగూడెం, పోలవరం పాఠశాలలో పనిచేసి గ్రామస్తుల భాగస్వామ్యంతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దారు. 2017లో సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కలెక్టర్లు, పలు స్వచ్ఛంద సంస్థల నుంచి నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.

డ్రాపవుట్లపై రమణ మార్క్



తణుకు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యపై మక్కువతో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు సేలపాటి వెంకట రమణ. 1983లో ఏలూరు జిల్లా జీలుగుమిల్లి పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా చేరారు. ఆయన తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులే. ఆయన పనిచేసిన పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. మురికివాడలో పిల్లలు, అనాథ పిల్లలు, డ్రాపవుట్లు నమోదుపై ఎక్కువగా దృష్టి సారించారు. వేసవి సెలవుల్లో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను చైతన్యం చేసి పిల్లను బడికి పంపించేలా ప్రోత్సహించారు. గ్రామాల్లో దాతలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి విరాళాలు సేకరించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 20 పైగా అవార్డులతో సత్కరించింది. 2021లో రాష్ట్ర విద్యా పరిశోధన మండలి అమరావతికి పాఠ్యపుస్తక రచయితగా ఎంపికయ్యారు. 2022లో జాతీయ విద్యా పరిశోధన మండలి, డైట్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌లో 'భారత రాజ్యాంగం మౌలిక స్వరూపం' అంశంపై ప్రత్యే వ్యాసం సమర్పించారు.

విద్యా దాత రాయపూడి



కొయ్యలగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆ ఉపాధ్యాయుడు ఏ పాఠశాలలో పనిచేసినా విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తారు. దాతల సహాయంతో పాటు సొంత సొమ్ము వెచ్చించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారు కొయ్యలగూడెం మండలానికి చెందిన రాయపూడి వెంకటరమణ. పని చేస్తున్న పాఠశాలల్లో మౌలిక కల్పనకు కృషి చేయాలని దాతల సహాయాన్ని కోరతాడు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన స్కూల్‌బ్యాగులు, యూనిఫాం, పెన్నులు, నోటుపుస్తకాలను దాతల నుంచి సేకరించి విద్యార్థులకు అందజేస్తారు. వెంకట రమణ తొలుత గోపాలపురం మండలం రేగులగుంట పాఠశాలలో నియమితులై పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అనంతరం కొయ్యలగూడెం మండలం ఏడువాడలపాలెం, రాజవరం, పొంగుటూరు, కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేశారు. ఆ పాఠశాలన్నిటిలోనూ మౌలికవసతులు కల్పనకు కృషి చేసి ఆయా గ్రామాల ప్రజల మన్ననలు పొందారు. ఆ పాఠశాలలో గేట్లు లేని పాఠశాలకు దాతల సహకారంతో గేట్లు కూడా వేయించారు. పిల్లల నమోదు చేయించడంలో కూడా ఆయన మంచిపేరు తీసుకున్నారు. గత సంవత్సరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా దక్కించుకుని అందరికి ఆదర్శంగా రాయపూడి వెంకటరమణ నిలిచారు.

శ్రీనివాస 'విద్యా'న వనం


పాఠశాల ఆవరణలో మొక్కల మధ్య విద్యార్థులతో శ్రీనివాసరావు మాస్టార్

లింగపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంచి బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దడమే కాదు పాఠశాల ఆవరణ ఉద్యాన వనంలా మార్చేశారు కలరాయనగూడెం పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు. ఆయన పనిచేస్తున్న పాఠశాల ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతుంది. బెండ, వంగ సొరకాయ, బీరకాయ వంటి కూరగాయలు, రకరకాల ఆకు కూరలు, బంతిపూల మొక్కలతో ముచ్చట గొలుపుతుంది. మొక్కల పెంపకం కూడా విద్యార్థులకు ఒక పాఠ్యాంశమే. ఆరోగ్యం, ఎరువులు లేకుండా సహజమైన ఆహారం ఆవశ్యతకత, పర్యావరణ పరిరక్షణ విద్యార్థులకు వివరిస్తారు. పాఠశాల ఆవరణలోనే ఆకుకూరలు, కూరగాయల చెట్లను పెంచడం ద్వారా తాజా కూరలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని భావిస్తారు. సొంత సొమ్ముతో పాఠశాల ఆవరణను బాగు చేయించి, సిమెంట్ స్థంబాలు ఏర్పాటుచేసి వాటిపై సొరకాయ, బీరకాయ లాంటి తీగ జాతి కూరగాయలను, ఆవరణలో వంగ, బెండ వంటి కూరగాయలు, గోంగూర, తోటకూర, పాలకూర పండిస్తున్నారు. చిన్నవయస్సు నుంచే ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సహజ సిద్ధమైన ఎరువులను వాడుతున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. కిచెన్ గార్డెన్‌కు సహచర ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారం ఎంతో ఉందన్నారు. ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మొక్కలకు నీరు పెడతామని, సెలవు రోజులలో మొక్కలు పాడవకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



ముసునూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సొంత సొమ్ము వెచ్చించి పాఠశాల అభివృద్ధికి రమణక్కపేట జడ్పీ పాఠశాల సోషల్ టీచర్ షేక్ షకీలా కృషి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పలు రకాల పండ్లు, ఇతర మొక్కలను నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పేద విద్యార్థులకు దుస్తులు సమకూర్చి చదువు కోసం అవసరమైన గైడ్స్, నోట్ బుక్స్, ఇతర సామగ్రి అందిస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన విద్యార్థులకు వైద్య సేవలు చేయిస్తున్నారు. సులభతరమైన విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. జాతీయ పండుగలకు నిర్వహించే ఆటల పోటీల్లో విజేతలకు ఆమె స్వయంగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. ప్రపంచ దేశాల్లో ఉన్న కరెన్సీ నాణెలను సేకరించి ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న అయాలు, వాచ్‌మెన్, వంట ఏజన్సీ వర్కర్లకు సొంత ఖర్చులతో ఏటా దుస్తులు అందిస్తున్నారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యాక్రమాలు, పాఠశాల క్లబ్‌ల నిర్వహణలో షకీల టీచర్ క్రియాశీలక పాత్రతో అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు



నతల ఇమ్మానుయేల్

ప్రొఫెసర్, ఉద్యాన విశ్వవిద్యాలయం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో ఎంటమాలజి ప్రొఫెసర్ డాక్టర్ నతల ఇమ్మానుయేల్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన తండ్రి ఎన్ రాబర్ట్ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగిగా పనిచేశారు. ఇమ్మానుయేల్ విద్యార్థి దశనుంచి ఎన్నో అవార్డులు అందుకున్నారు. 18 ఏళ్ల ఉద్యోగ జీవితంలో పరి శోధన, బోధనా విభాగాల్లో అంతర్జాతీయ జాతీయ అవార్డులు కూడా సాధించారు. ఆయన భార్య కిరణ్ పాత్రో ఉద్యాన విశ్వవిద్యాలయంలోనే అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తాను ఎప్పటికీ నిత్య విద్యార్థినేనని ఇటు పరిశోధనలు, విద్యా బోధనలో పనిచేయడం ఎంతో ఇష్టమని అంటారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు రావడం తనకు మరిచిపోలేనిదన్నారు. ఇమ్మానుయేల్‌ను విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ బి.గోపాల్, విశ్వ విద్యాలయ అధికారులు అభినందించారు.



ఎన్.సాంబశివరావు

ప్రొఫెసర్, ఎన్ఆర్ఐ కళాశాల

ఆగిరిపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ విద్యారంగంలో అద్భుతమైన సేవలందించిన ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ కళాశాల ఈఈఈ విభాగం ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ ఎన్.సాంబశివరావుకు రాష్ట్ర ఉత్తమ అవార్డు లభించింది. ఇంజనీరింగ్ కళాశాలల విభాగంలో ఈఈఈ శాఖ కేటగిరిలో అనేక సంవత్సరాలుగా బోధనలో నాణ్యతను పెంపొందిస్తూ, పరిశోధనలో విశిష్టమైన కృషిచేస్తూ, విద్యార్థులను సృజనాత్మక ఆలోచనల వైపు తీసుకెళుతున్నారు. 2015లో జేఎన్‌టీయూ కాకినాడ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. విద్యార్థుల ప్రాజెక్టులు, పరిశోధన పత్రాలు, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలు, విభాగం వృద్ధి అన్నింటిలోనూ ఆయన నాయకత్వం విశేషంగా నిలిచింది. ఈఈఈ విభాగాన్ని కొత్త ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయనకు అవార్డు రావడంతో పలువురు అభినందించారు.



ఎ.జ్యోత్స్న దేవి

లెక్చరర్, జూనియర్ కళాశాల, నారాయణపురం

ఉంగుటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం జూనియర్ కళాశాల లెక్చరర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. బాలికా విద్య కుటుంబానికి, సమాజానికి శ్రేయస్సు అని ఆమె నమ్ముతారు. తాను 2003లో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరానని, విద్యార్థుల ఉన్నతికి, ముఖ్యంగా బాలికా విద్యకు తాను ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. తనకు తొలిసారిగా రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు

కుసుమకుమారి

ప్రొఫెసర్, వాసవి ఇంజనీరింగ్ కళాశాల



తాడేపల్లిగూడెం రూరల్/కొయ్యలగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ, ఈసీటి విభాగాధిపతి కుసుమ కుమారి రాష్ట్ర ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. కొయ్యలగూడెంకు చెందిన ఆమె 12 ఏళ్లుగా వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నిరంతరం ఏదొక కొత్త అంశం నేర్చుకో వాలనే తపనే తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని కుసుమ కుమారి అన్నారు. అవార్డును శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి అందుకోనున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపికైన కుసుమ కుమారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు, పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, సిబ్బంది, కొయ్యలగూడెం గ్రామస్తులు అభినందించారు.



డాక్టర్ మంగళగిరి హరిప్రసాద్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు

కైకలూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యా బోధనతో ఆయన పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. తాజాగా డాక్టర్ మంగళగిరి హరిప్రసాద్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 2006లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడిగా చేరారు. 2014లో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారిగా అవార్డు అందుకున్నారు. జర్నలిజం నాగార్జున యూనివర్సిటీలో జర్నలిజం చేశారు. టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిప్లమో చేశారు. వివిధ విభాగాల్లో జిల్లాస్థాయిలో 15 ఉత్తమ అవార్డులను అందుకున్నారు. నాగార్జున యునివర్సిటీ నుంచి లేసు అల్లికలపై పీహెచ్‌డీ ద్వారా అందుకున్నారు. హిస్టరీపై 8 రాష్ట్రస్థాయి పుస్తకాలను రాసి ప్రశంసలను పొందారు. రాష్ట్ర స్థాయి అవార్డు స్ఫూర్తితో బోధన, పరిశోధనలకు మరింత ప్రాధాన్యం ఇస్తానన్నారు.



మధిర శ్రీరామమూర్తి

బాలికల జూనియర్ కళాశాల, పాలకొల్లు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ మధిర శ్రీరామమూర్తికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రకటించింది. శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి అవార్డు అందుకోనున్నారు. ఉత్తమ అధ్యాపకుడి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంమే లక్ష్యం అని, అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన శ్రీరామమూర్తి 2000లో స్కూల్ అసిస్టెంట్‌గా చేరి 2012లో ఏపీపీఎస్సీలో ఎంపికై ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేశారు. 2021 నుంచి పాలకొల్లు కళాశాలలో పనిచేస్తున్నారు. శ్రీరామమూర్తికి అవార్డు రావడంపై ప్రిన్సిపాల్ బి.అప్పారావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

కన్నతండ్రే కాలయముడు




హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

- జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లికెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్జియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్జియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారంగా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.



చెక్కును అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ

కేసు పరిష్కారానికి 41 ఏళ్లు

భూసేకరణలో భార్యాభర్తలకు చెరో రెండున్నర లక్షలు చెల్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఆ కుటుంబానికి న్యాయం జరిగేందుకు పట్టిన సమయం 41 ఏళ్లు. ఎన్నో కోర్టు వాయిదాల అనంతరం.. లోక్ అదాలత్‌లో ఈ కేసుకు పరిష్కారం లభించింది. వివరాల్లోకి వెళితే.. ఏలూరుకు చెందిన వెన్నవల్లి శ్రీరామమూర్తి ఆయన భార్యకు ఏలూరులో నాలుగు ఎకరాల 66 సెంట్ల పొలం ఉంది. 1984లో పేదలకు ఇళ్లు ఇచ్చే నిమిత్తం అప్పటి ప్రభుత్వం భూసేకరణ చేసింది. ఎకరం రూ.75 వేలు వంతున నష్టపరిహారం చెల్లించింది. అయితే ఇది మార్కెట్ ధరకు సమానం కాదని శ్రీరామమూర్తి దంపతులు ఏలూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటిషన్(ఈపీ) దాఖలు చేశారు. మరోవైపు హైకోర్టులోను పిటీషన్లు వేయగా దఫదఫాలుగా ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆ దంపతులకు రూ.27 లక్షలు చెల్లించింది. అయితే 1984 నుంచి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో వున్న పిటీషన్ పెండింగ్‌లోనే ఉంది. ఆ కేసు పరిష్కారానికి కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో ఏలూరు తహసిల్దార్ గాయత్రి, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి ఇటీవల లోక్ అదాలత్‌లో పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. 1984లో ఏలూరు పాండురంగ థియేటర్ సమీపంలో శ్రీరామమూర్తి దంపతులకు చెందిన భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన ప్రభుత్వం వీరి ఇంటి పేరు వెన్నవల్లి వారిపేటగా కాలనీకి నామకరణ చేసింది. లోక్ అదాలత్‌లో ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని శ్రీరామమూర్తికి రెండున్నర లక్షలు, ఆయన సతీమణికి మరో రెండున్నర లక్షలు నష్టపరిహారం ఇచ్చే విధంగా ఈపీ పిటీషన్‌ను పరిష్కరించారు. ఆ రెండు చెక్కులను సీనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ శ్రీరామమూర్తి దంపతులకు అందించి, రెండు కేసులు పరిష్కారమైనట్టు తేల్చారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సు అభ్యర్థులకు 9న కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):వైద్య ఆరోగ్య శాఖ జోన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కాంట్రాక్టు పద్ధతిన స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయడానికి ఈ ఏడాది జనవరిలో జారీచేసిన నోటిఫికేషన్ మేరకు మెరిట్ కం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపికైన 59 మంది అభ్యర్థుల జాబితాను గురువారం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు రాజమహేంద్రవరంలోని రీజినల్ డైరెక్టర్ తెలిపారు. జాబితాలో పేర్లు వున్న అభ్యర్థులు ఈ నెల 9న రాజమహేంద్రవరంలోని వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ నిమిత్తం హాజరు కావాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అదేరోజున కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తామన్నారు.

స్నేహితుడిని పరామర్శించడానికి వచ్చి..

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో వున్న స్నేహితుడిని పరామర్శించడానికి వచ్చిన మనెల్లి చినరామయ్య(79)ను లారీ ఢీకొట్టిన ఘటనలో మృతి చెందాడు. హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురానికి చెందిన చినరామయ్య గురువారం ఈ సేవ కేంద్రం వద్ద ఆటో ఎక్కడానికి వెళ్తుండగా పేరంపేట వైపు నుంచి ఏలూరు రోడ్డు వైపు వెళ్తున్న లారీ వెనుక భాగం తగిలి కింద పడిపోయాడు. లారీ వెనుక టైరు అతని తలపై నుంచి వెళ్లగా చినరామయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలియచేశారు.

యూరియా వెతలు

సొసైటీలకు పోటెత్తిన రైతులు.. దొరసానిపాడు ఎరువుల దుకాణంలో జేసీ ధాత్రిరెడ్డి తనిఖీ



ముదినేపల్లి మండలం వడాలి సొసైటీలో యూరియా కోసం గుమికూడిన రైతులు

ముదినేపల్లి/కుక్కునూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా వెతలు తీరడం లేదు. అవసరానికి తగిన విధంగా యూరియా కేటాయింపులు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. గురువారం మండలంలోని వడాలి, వాడవల్లి సహకార సంఘాలకు సుమారు 25 టన్నుల యూరియా రాగా, వందల సంఖ్యలో రైతులు ఎగబడ్డారు. వడాలి సొసైటీకి 12 టన్నులు, వాడవల్లి సొసైటీకి 13 టన్నుల యూరియా కేటాయింపులు జరుగగా, ఆయా సొసైటీ పరిధిలోని రైతులే కాక పరిసర గ్రామాల రైతులు వచ్చి క్యూ కట్టారు. తమ సొసైటీలకు వచ్చిన కొద్దిపాటి ఎరువును రైతులకు ఎలా సర్దుబాటు చేయాలన్నది అర్థంకాక సంఘాల అధ్యక్షులు, సీఈవోలు తలలు పట్టుకుంటున్నారు.

● కుక్కునూరు మండలంలో ఈ ఏడాది పత్తి, జామాయిల్ పంటలు విస్తారంగా సాగవుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రధానంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఐదు వేల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ప్రస్తుతం పూత, పిందె దశలో పత్తి పంట ఉండడంతో యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు వేయాల నేది రైతులు ఆలోచన. కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికి యూరియా కొరత రైతాంగాన్ని వేధిస్తుంది. యూరియా వచ్చిందన్న సమాచారం తెలిసిన వెంటనే వందలాదిమంది రైతులు ఎగబడుతున్నారు. వచ్చే పది రోజుల్లో రైతాంగం అవసరం కోసం 150 టన్నుల యూరియా కావాలని ఉన్నతాధికా రులకు సమా చారం ఇచ్చినట్లు వ్యవసాయా ధికారి బాలాజీ తెలిపారు.

దొరసానిపాడులో జేసీ తనిఖీ

ద్వారకాతిరుమల :దొరసానిపాడులో ఎరువుల దుకాణాన్ని గురువారం ఏలూరు జిల్లా జేసీ పి.ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక వేపాలమ్మ ఆలయం వద్దనున్న ఓ ఎరువుల దుకాణానికి వెళ్లి రిజిస్టర్లను తనిఖీ చేసి నాణ్యమైన ఎరువులు రైతులకు అందించాలని యజమానులకు సూచనలు చేశారు.

ఎరువులు బ్లాక్ మార్కెట్ తరలిపోకుండా ప్రత్యేక నిఘా : ఎస్పీ

దెందులూరు/భీమడోలు:రైతుల అవసరాలకు తీసుకువచ్చిన ఎరువులను బ్లాక్ మార్కెట్ తరలిపోకుండా ప్రత్యేక నిఘా పెట్టామని ఏలూరు జిల్లా ఎస్పీ కె.కిశోర్ తెలిపారు. దెందులూరు మండలం సీతంపేట సొసైటీ పరిధిలోని పెరుగుగూడెం బ్రాంచి గొడౌన్‌లోనూ, భీమడోలులోని సహకార సంఘ సొసైటీ గొడౌన్‌లలో యూరియా నిల్వలను విజిలెన్స్ డీఎస్పీ సింగలూరు వెంకటేశ్వరరావుతో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లాలో 350 మెట్రిక్ టన్నుల యూరియాను రైతుల కోసం సొసైటీల ద్వారా ఒక్కొక్క సంఘానికి 100 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించామని వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా అధికారులకు వివరించారు. ఈ వారంలో వంద టన్నుల యూరియాను దెందులూరు మండలానికి అందిస్తామన్నారు. భీమడోలు సొసైటీలో 30 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. దెందులూరు మండలంలో సీతంపేట సొసైటీ అధ్యక్షుడు యలమర్తి వీరవెంకట సత్యనారాయణ, భీమ డోలులో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, రైతులు ఉన్నారు.

33 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

పెదపాడు:పెదపాడు మండలంలోని పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.9,03,520 విలువ చేసే 33 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని పెదపాడు ఏవో షేక్ ఇమామీ ఖాసిం తెలిపారు. అప్పనవీడు, వసంతవాడ గ్రామాల్లోని ఎరువుల దుకా ణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో శ్రీశ్రీనివాస ఏజెన్సీ (అప్పనవీడు) 29.05 మెట్రిక్ టన్నులు, శ్రీశ్రీకృష్ణ అగ్రో ఏజెన్సీస్ (వసంతవాడ) 3.95 మెట్రిక్ టన్నులు మొత్తం 33 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు సింగులూరి వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, ఏవో మీరయ్య, విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్, కె.సీతారాము, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అత్తిలిలో రెండు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ : కేంద్ర మంత్రి వర్మ



అత్తిలి రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి, కేంద్ర మంత్రి వర్మ

భీమవరంటౌన్/అత్తిలి, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పార్ల మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ జాతీయ రహదారుల నిర్మాణం, కొత్త రైల్వే ప్రాజెక్టుల సాధనపై దృష్టి సారించామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. గురువారం భీమవరం బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు హైవేల నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయల నిధులు సాధించామని, రూ.2,500 కోట్లతో చేపట్టాలనుకున్న ఎన్‌హెచ్-165 వయా భీమవరం బైపాస్ రోడ్డు ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చాయని అయితే, రాష్ట్ర ప్రభుత్వం సీఎస్ఆర్ రేట్లు పెంచడంతో ప్రాజెక్టు వ్యయం రూ.3,200 కోట్లకు పెరిగిందని, అదనంగా పెరిగిన రూ.700 కోట్లకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారని ఈ ప్రాజెక్టు కోసం రూ.3,200 కోట్లతో డీపీఆర్ సిద్ధమైందన్నారు. ఈనెలలోనే నరసాపురం-చెన్నై వందే భారత్.. చెన్నై-విజయవాడ వందే భారత్ రైలును నరసాపురం వరకు పొడిగించాలని రైల్వే మంత్రిని కలిసి చర్చించామని, త్వరలో ఉత్తర్వులు వస్తాయన్నారు. అత్తిలి రైల్వేస్టేషన్‌లో పూరీ-తిరుపతి, కాకినాడ-చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లను అత్తిలి రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారని, రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదలవుతాయన్నారు. అత్తిలి రైల్వేస్టేషన్‌లో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి మంత్రి పర్యటించారు. నరసాపురం-అరుణాచలం వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలును మరో నెల పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారని, ఈ రైలును రెగ్యులర్ రైలుగా మార్చాలన్న దానిపై స్పందన వచ్చిందన్నారు. జీఎస్టీ భారీగా తగ్గించటం చారిత్రిక నిర్ణయం జీఎస్టీ అమలులో మార్పులు, సంస్కరణలు తీసుకువస్తామని ప్రధాని మోదీ చెప్పినట్లుగానే, జీఎస్టీ కౌన్సిల్ స్లాబులను తగ్గించి తీసుకున్న నిర్ణయం సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందన్నారు. ఆరోగ్య బీమా, వ్యక్తిగత బీమాలపై ఉన్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని, స్టీల్ ప్లాంట్‌ను నష్టాల నుంచి లాభాల బాట పట్టించేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నామన్నారు.

ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాలపైకి..



ఏలూరు క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి ఫోన్ మాట్లాడుతూ పట్టాలపై వెళ్లడంతో.. రైలు ఢీకొని మృతి చెందాడు. పెదపాడు మండలం ఏపూరుకు చెందిన ఇంటర్ విద్యార్థి శిరిగిరి సాయితేజ(16) బుధవారం రాత్రి భోజనం చేసి ఫోన్ మాట్లాడుతూ గ్రామ రైల్వే గేటు వద్ద పట్టాలు దాటు తుండగా రైలు ఢీకొని ముక్కముక్కలైపోయాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు గురువారం తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య



అకాల వర్షాలకు మొక్కజొన్న పంట పాడై నష్టాలు రావడంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. చింతలపూడి మండలం నర్సింగపురానికి చెందిన మాదాసు సూరిబాబు(45)కు భార్య, ఇద్దరు పిల్లలు. రెండు ఎకరాలు సొంత భూమితోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట వేశారు. పండిన పంటను కల్లంలో ఆరబెట్టగా కురిసిన వర్షాలకు తడిచిపోయి మొక్కలు వచ్చేశాయి. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది 3వ తేదీ రాత్రి పురుగు మందు తాగడంతో.. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి.. ఒకరి మృతి

మద్యం మత్తులో పురుగు మందు తాగిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. చాట్రాయి మండలం చీపురుగూడానికి చెందిన మానికల సత్యం(60) గురువారం ఉదయం అతిగా మద్యం తాగి.. ఆ మత్తులో పురుగుమందు తాగేశాడు. అస్వస్థతకు గురైన అతని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గంజాయి పంచుకుంటుండగా ఆరుగురి అరెస్టు




గంజాయి పంచుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి మూడు కేజీల 460 గ్రాముల గంజాయి, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు సిబ్బందితో ఈ నెల 3న ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో నిఘా పెట్టారు. అక్కడ ఆరుగురు యువకులు గంజాయిని పంచుకుంటుండగా వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఏలూరుకు చెందిన విష్ణుశెట్టి సత్యరూపాకుమార్, కొమ్మిన మణికంఠ, తమ్మిశెట్టి రామ్‌చరణ్, అల్లంపల్లి రాజేష్‌తోపాటు మరో ఇద్దరు మైనర్ బాలలను అరెస్టు చేశారు. వీరిపై గతంలో వివిధ ప్రాంతాల్లో కేసులు ఉన్నాయని గుర్తించారు.

తెలంగాణకు ఇసుక లారీలు.. పట్టివేత

చింతలపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):తెలంగాణ సరిహద్దు మేడిశెట్టివారిపాలెం, గురుభట్లగూడెం లూపు లైన్ల నుంచి ఇసుక లారీలు వెళ్తున్నాయనే సమాచారంతో తనిఖీలు జరిపి 16 ఇసుక లారీలను పట్టుకున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. పట్టుకున్న లారీలను రెవెన్యూ శాఖకు బదిలీ చేస్తామని చెప్పారు.

మాధవరం కంసాలిపాలెం వంతెన బంద్



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఎగువన కురిసిన వర్షాలతో ఎర్రకాలువ వరద నీటితో పోటెత్తింది. దీంతో మాధవరం - కంసాలిపాలెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి మరింత వరద నీరు వచ్చి చేరితే వరి పొలాలు నీటమునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బీసీ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం పట్టణంలోని బీసీ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్ కోరారు. ఈ మేరకు ఆయన కొయ్యలగూడెంలోని బీసీ వసతి గృహాలు పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థులకు వసతిగృహాలు లేక అద్దెభవనాల్లో ఉంటున్నారని అన్నారు. కావున ప్రభుత్వం బీసీ వసతిగృహాలను నిర్మించాలని ఈ సందర్భంగా కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రాంతికుమార్, సీపీఐ మండల కార్యదర్శి ఆంజనేయరాజు కోరారు.

సుబ్బరాయన్‌కు డీఎల్‌పీవోగా పదోన్నతి



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ఈవోపీఆర్డీ, డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆకుల వెంకట సుబ్బరాయన్ డీఎల్‌పీవోగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయనను జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోగా నియమిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనతో పాటు జిల్లాలోని పలువురు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందారు.

జీఎస్టీలో మార్పులతో ప్రజలకు మేలు : కేంద్ర మంత్రి వర్మ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో చేసిన మార్పుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. మండలంలోని పొంగుటూరులో గురువారం పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు ప్రజలు చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు, మాజీ జడ్పీటీసీ ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి, మాజీ సర్పంచ్ నరసింహరాజు, పొంగుటూరు సర్పంచ్ పసుపులేటి రామారావు, కూటమి నాయకులు తోట రవి ఉన్నారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు హర్షణీయం

టి.నర్సాపురం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడం పట్ల నవభారత్ ఆయిల్‌ఫామ్ జంగారెడ్డిగూడెం జోన్ రైతు సంఘం అధ్యక్షులు, మాక్కినవారిగూడెం సొసైటీ ఛైర్మన్ ఆచంట సూర్యనారాయణ గురువారం విలేకర్ల మావేశంలో హర్షం వ్యక్తం చేశారు. రైతుల తరఫున ఆచంట సూర్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. ఎం.ప్రభు శేఖర్, ఆచంట చక్రధరరావు, ఎం.రాంబాబు, చవల నాగరాజు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ మద్యాన్ని అరికడతాం : ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ మద్యాన్ని అరికడతామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో అక్రమ మద్యం కేసులు వెలుగు చూడటంపై ఎంపీ మహేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలో కల్తీమద్యం బయటపడటంతో ఎక్సైజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైన బెల్టుషాపులు కనిపించినా, మద్యాన్ని ఎంఆర్‌పీ కంటే మించి విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే జీఎస్టీ తగ్గింపు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పెట్టుబడి మార్కెట్ అంశాలపై అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):పెట్టుబడిదారులను ఆర్థిక మార్కెట్లకు పరిచయం చేయడం, అందులో పాల్గొనడం, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు, పెట్టుబడి ప్రపంచంలో ఉన్న అపోహలు, వాస్తవాలు, మోసపూరిత పథకాల నుంచి డబ్బును సురక్షితంగా ఎలా ఉంచుకోవాలనే అంశాలపై గురువారం స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో డిగ్రీ బీకాం విద్యార్థులకు వర్కుషాపు జరిగింది. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రాము పాల్గొన్నారు.

అంతర్జాతీయ పతాక విజేతకు ఘన సన్మానం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కన్నాపురం అటవీ శాఖ కార్యాలయంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎస్.నాగవాసు నాయుడు జర్మనీ దేశంలో ఇటీవల జరిగిన 'వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్-2025'లో రేస్ వాక్ విభాగంలో భారతదేశం తరఫున పాల్గొని వెండి పతకం సాధించారు. భారతదేశ ఖ్యాతిని పెంపొందించిన అధికారిని గురువారం కార్యాలయం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. దేశానికి పతకం సాధించడం ఎంతో గర్వంగా ఉందని వాసు నాయుడు తెలిపారు. అటవీ శాఖాధికారి ఎస్.కె.వలీ, డిప్యూటీ రేంజర్ జె.ప్రభాకర్, హెడ్ క్వార్టర్ ఎఫ్ఎస్‌వో బి.దినేష్, ఎండీ కరీం, పోశారావు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములు కొనవద్దు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ప్రభుత్వం భూసేకరణ చేస్తున్నందున ఎల్.టి.ఆర్. 1/70 చట్టం పరిధిలోని భూములు కొనుగోలు చేయవద్దని సీపీఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.రేగులకుంటలో తామా ముత్యాలమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. వివాదాల్లో లేని భూములే ఆర్అండ్ఆర్‌కు సేకరించాలన్నారు. కారం సూర్యచంద్రం, లక్ష్మణరావు, సత్తిబాబు, బద్రం ఉన్నారు.

పవిత్రోత్సవాల్లో నరసింహ హవనం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం 24వ వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం శ్రీసుదర్శన నరసింహ హవనాన్ని ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, వేదపండితులు నిర్వహించారు. శుక్రవారంతో శ్రీవారి పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు.

సొసైటీ ఛైర్మన్‌గా సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం



టి.నర్సాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మక్కినవారిగూడెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా ఆచంట సూర్యనారాయణ, పర్సన్లు నరదల నాగేశ్వరరావు, దాసరి వెంకటలక్ష్మి, ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ యర్రా ఏసుకుమార్ ఆధ్వర్యంలో గురువారం పదవీబాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ గోపాలరావు, కొడాలి విజయ్, వీ.ప్రతాప్ కుమార్, వాసిరెడ్డి రామ్మోహనరావు, సీఈవో యూవీవీ సత్యనారాయణ ఉన్నారు.

నేడు మిలాద్ ఉన్ నబి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అత్యంత పవిత్రమైన ఈద్-ఏ-మిలాద్ -ఉన్-నబి పర్వదిన వేడుకలు శుక్రవారం జరగనున్నాయి. పట్టణాలు, పల్లెల్లోని మసీదులు, దర్గాలు ముస్తాబయ్యాయి. ముస్లింలు ర్యాలీలు, అన్నదానాలు, మత పెద్దల బోధనల కోసం ఏర్పాట్లు చేశారు. మహ్మద్ ప్రవక్త జయంతిని కొన్ని ముస్లిం తెగలు ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీగా జరుపుకుంటారు.

పదవుల కేటాయింపుతో ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు

దెందులూరు/నిడమర్రు/లింగపాలెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గంథాలయ పరిషత్ డైరెక్టరుగా ముమ్మడి సక్కు కుమారిని ప్రభుత్వం నియమించింది. చల్లచింతలపూడి గ్రామానికి చెందిన దెందులూరు మాజీ జడ్పీటీసీ ముమ్మడి సక్కు కుమారి టీడీపీ అభివృద్ధికి విశేషంగా పని చేశారు. కుమారి, చింతయ్య యాదవ్ దంపతులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరక్టర్‌గా నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావును నియమించారు. లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామానికి చెందిన పల్లి శ్రీను ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ నియమించారు. శ్రీను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇదేంటి మాస్టారు..?

(3వ పేజీ తరువాయి)

ఉన్నతపాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామోపాధ్యాయులకు అందజేయనున్నారు. జిల్లాలో ఈ అవార్డులకు పెదవేగి, వట్లూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాల, ఏలూరు ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు, కొవ్వలి జడ్పీ హైస్కూలు ఎంపికయ్యాయి. ఈ అవార్డులతో పాటే ఇంటర్మీడియట్ విద్యనుంచి జిల్లా ఉత్తమ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన ఒకరికి పురస్కారాన్ని అందజేస్తారు. మొత్తంమీద 33 మందికి అవార్డులను శుక్రవారం అందజేయడానికి జిల్లావిద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

భారం దిగింది!

(3వ పేజీ తరువాయి)

సరుకు వచ్చినప్పుడు, తర్వాత అమ్మకాలు జరిగినప్పుడు లావీదేవీల్లో ఎగవేతలకు ఆస్కారం ఉండదని జీఎస్టీ అధికారులు అంచనా వేస్తున్నారు.

పేదలకు ఉపయోగం: ఎస్.రాజేంద్ర, జిల్లా మర్చంట్ ఛాంబర్స్ అధ్యక్షుడు



జీఎస్టీ శ్లాబ్‌ల ఎత్తివేతతో చాలా మందికి ప్రయోజనం జరుగుతుంది. అయితే సైకిళ్లు, సిమెంట్ పైనా జీఎస్టీ ఎత్తివేయాలి. పేదలకు ఇది ఉపయోగపడేది. ఫెర్టిలైజర్స్, హ్యాండ్‌క్రాఫ్ట్స్, బయోవేస్ట్ ఉత్పత్తులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గిస్తే చాలా మందికి ఉపయోగం.

రోగులకు ఊరటే : ఎం.విక్రమ్, ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్

జీఎస్టీ శ్లాబ్‌ల మార్పుల వల్ల అన్ని మందులు వివిధ స్థాయిల్లో ధరల తగ్గుదల ఉంటుంది.36 రకాల మందులపై పూర్తిస్థాయిలో పన్ను ఎత్తివేయడం నిరంతరం దీర్ఘకాలికంగా మందులు వాడేవారు చాలామంది ప్రజలకు ఊరటనిస్తుంది. రేట్లను కంపెనీలు పెంచకుండా నిరోధించ వచ్చు. పన్ను తగ్గే వరకు డీలర్లు 10 నుంచి 20 రోజులు సరఫరాలో అంతరాయం కలిగిస్తే వినియోగదారులు ఏలూరు పవర్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.



కూరగాయల మార్కెట్ వద్ద గణపతి





జీలుగుమిల్లిలో చిన్నారుల సందడి... ఏలూరులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



ఉంగుటూరులో చిన్నారుల ప్రదర్శన

జై..జై.. గణేశా

ఘనంగా కొనసాగిన నిమజ్జనాలు
సంబరాలకు కదలివచ్చిన ఊరూవాడా

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గణేశ్ నవరాత్రులు శుక్రవారంతో ముగియనున్నాయి. ముగింపు సందర్భంగా గణేశ్ ఉత్సవాల్లో శిబిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, కల్యాణాలు నిర్వహించారు. సత్రంపాడులోని లక్ష్మీ గణపతి స్వామి ఆలయం వద్ద ఫలార్చన నిర్వహించారు. కుండీ సెంటర్‌లోని శ్రీహేలాపురిలో బుధవారం రాత్రి కల్యాణో త్సవం నిర్వహించారు. రామకోటిలో లక్ష్మీగణపతి హోమం, కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

● ఏలూరుటూటౌన్: గణపతి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. కట్టా సుబ్బారావు తోటలో వినాయకచవితి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మెహర్‌బాబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించగా గూడవల్లి వాసు, కార్పొరేటర్ కలవకొల్లు సాంబశివరావు, కడియాల విజయలక్ష్మి, ఎస్.రాము, లంకపల్లి మాణిక్యాలరావు, వేమూరి తిలక్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: ఏలూరులో పలు డివిజన్‌లలో వినాయకచవితి వేడుకలను ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్, రెడ్డి అప్పలనాయుడు హాజరై ప్రారంభించారు. జనసేన క్లస్టర్ ఇన్‌చార్జిలు రెడ్డి గౌరీశంకర్, ఎట్రించి ధర్మేంద్ర, మంగం శివ, బత్తుల సాయి కుమార్, గుదె జగదీష్, రెడ్డి చంద్రమౌళి, రెడ్డి బలరాం, రెడ్డి మనోజ్, బత్తుల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. శనివారపుపేట గంగానమ్మ ఆలయం వద్ద మూడవ బాల గణపతి మహోత్సవాల్లో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. కృష్ణ కాలువలో నిమజ్జనం చేశారు.

● బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలోని గీతామందిరం వద్ద వరసిద్ధి వినాయక స్వామి ఊరేగింపును గురువారం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు అనంతరం పుంతచెరువులో నిమజ్జనం చేశారు. స్వామివారి పన్నిధిలో ఏర్పాటు చేసిన రెండు లడ్డూలను వేలం నిర్వహించగా 15 కేజీల లడ్డూను రెడ్డిగణపవరానికి చెందిన ఇల్లా నాగేంద్ర రూ.16,300, 10 కేజీల లడ్డూను కొండ్లగూడేనికి చెందిన మద్యాహ్నపు రామచంద్రరావు రూ.8300 దక్కించుకున్నట్టు భౌమరాజు ధనుంజయ రాజు తెలిపారు.

● పోలవరం : గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని గురువారం భారీ ఊరేగింపులతో నిమజ్జనాలు నిర్వహించారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో పోలీస్ బందోబస్త్ మధ్య నిమజ్జనాలు జరుగుతున్నాయి. 13 భారీ గణపతి ప్రతిమలను నిమజ్జనం చేశారు. పోలవరం ఎస్.ఐ. పవన్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది పోలీసు బలగాలు ప్రత్యేక పోలీసు సిబ్బంది విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి.

● కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలంలో గురువారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో ఉన్న గణపతి ఆలయం వద్ద భారీ ఊరేగింపు ఏర్పాటు చేశారు. కన్నాపురం రోడ్డులోని గణపతి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని పొంగుటూరు, ఎర్రంపేట, కన్నాపురం గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు తిలకించడానికి భక్తులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: పూచికపాడులో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని గణనాథుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గణేశ్ టీ షర్టులతో గ్రామంలో విగ్రహంతో పాటు నిర్వహించిన ఊరేగింపు పలువుర్ని ఆకట్టుకుండి. తాటియాకులగూడెంలో గణనాథుల ఊరేగింపు నిర్వహించారు. డీజే వాయిద్యాలతో జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారి ఆలయం వద్ద సందడి చేశారు.

● భీమడోలు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలుగ్రామాల్లో ఊరేగింపు, నిమజ్జనాలు సందడిగా జరిగాయి.భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించారు. భీమడోలులో శ్రీమన్నహా గణపతి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. పలు చోట్ల అన్న సమారాధనలు చేపట్టగా భక్తులు పలహారాన్ని స్వీకరించారు.



సెలీన్‌రోజ్‌ను సత్కరిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్..



ద్వారకాతిరుమలలో ఉపాధ్యాయులకు సత్కారం దృశ్యం..



భీమడోలులో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

గురుదేవో భవ..

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో గురువుల పాత్ర మరువలేనిదని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టిన్ ఫెర్నాండెజ్ అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన గురుపూజోత్సవంలో మూడున్నర దశాబ్దాలుగా ఎన్‌సీసీ మేజర్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ పీఎం సెలీన్ రోజ్, అధ్యాపక వృత్తిలో రెండున్నర దశాబ్దాలుగా పని చేస్తున్న సీనియర్ లెక్చరర్లు గాయత్రి, మాధవీ రాణి, విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ విద్యార్థుల కలలకు కార్యరూపమిచ్చే గురువులే నిజమైన దేవుళ్లని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు, అధ్యాపకులు అజయ్‌కుమార్, రాంబాబు, వెంకట్రావు, రమేశ్, పద్మావతి, విజయ్ కుమార్, పరమేశ, కృష్ణచైతన్య, దుర్గాప్రసాద్, కావ్యశ్రీ, సుస్మలత, సుజాత, మధుసూదన్‌రావులను కళాశాల ప్రణాళిక, అభివృద్ధి మండలి(సీడీపీసీ) కార్యదర్శి రఘుబాబు, సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావులు ఘనంగా సన్మానించారు.

● ద్వారకాతిరుమల: విద్యార్థులను బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని మండల లయన్స్ క్లబ్, మానవత సంస్థల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్లబ్ మండలాధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులు పి రాజేశ్వరమ్మ, పి.ప్రభాకరరావు, బి.అపర్ణ, ఆర్.శిరీషలను ఎంఈవోలు ఎం.సత్యనారాయణ, పి.వెంకట్రావులు సత్కరించారు. దేవరపల్లి రాయుడు బాబు పాల్గొన్నారు.

●పోలవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలవరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు గురువులకు పూజలు నిర్వహించారు. పోలవరం బీసీ కాలనీ హైస్కూల్లో భరతనాట్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు పెద్దింటి నాగేశ్వరరావు, కె.గీతాప్రభ, సత్యనారాయణ పాల్గొన్నారు.

● భీమడోలు: విద్యావేత్తగా రాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పాతూరు ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎం సుధాకర్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పెదపాడు: వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని నిర్వహించారు. గురువు ప్రాముఖ్యతను తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సరళ, భానుప్రకాష్, హిమబిందు, ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

● పెదవేగి: విద్యార్థి భవిష్యత్‌కు పాఠశాలలోనే పునాది పడుతుందని రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్ ఉన్నతంగా ఎదగడానికి బడి ఉపయోగపడుతుందన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డాక్టర్ గుగులోతు కృష్ణ మాట్లాడుతూ గురువు ప్రవర్తన, విద్యా బోధన సక్రమంగా లేకపోతే ఒక తరమంతా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, కృష్ణ, ఉపాధ్యాయులు గంగాధరరావు, చంద్రకళ, మీనా, రవికుమార్, అశోక్, ఖాసింబీ, వరలక్ష్మి, లీలా, సుభాషిణి, శిరోమణిని సత్కరించారు.

లక్ష్మీపురంలో పారిశుధ్యం పరిశీలన

పెదవేగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) అనూరాధ అన్నారు. లక్ష్మీపురం సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె గ్రామంలో పర్యటించి, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్పంచ్ మేకా కనకరాజు, ఈవో పీఆర్డీ షరీఫ్, కార్యదర్శి కేవీ.ప్రసాద్, మహిళా సం రక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన అవసరం

లింగపాలెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ గ్రామాల్లో చెత్తసేకరించాలని, మురుగు కాలువలను పూడిక తీయించాలని జిల్లా పంచాయితీ అధికారి కొడాలి అనురాధ అన్నారు.మండలంలోని బాదరాల, లింగపాలెం గ్రామాల్లో పంచాయితీ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు.డిప్యూటీ ఎంపీడీవో ఏ సుందరి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చామన్నారు. వేలాది మంది సమస్యలు పరిష్కరించామన్నారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు

టి.నర్సాపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి):ఒకరిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. గట్టుగూడెం గ్రామానికి చెందిన రవ్వా మోహనరావుకు అదే గ్రామానికి చెందిన ఏడుగురి మధ్య పాతగొడవలు ఉన్నాయి. దారికాచి కర్రలతో దాడి చేయగా చుట్టుపక్కల వారు వచ్చేసరికి పారిపోయారు. క్షతగాత్రుడిని కారులో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా దారికాచి చంపుతామని బెదిరించారు.స్థానికులు చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పెదవేగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందించారు. ఎవ్వరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజల అవసరాలకు సంబంధించి ఏ సమయంలోనైనా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.

సాధారణ ప్రసవంతోనే తల్లికి క్షేమం

పెదపాడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ లేకుండా సాధారణ ప్రసవం వల్లే తల్లి, బిడ్డలకు మంచిదని పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు చక్రధర్ తెలిపారు. పెదపాడు పీహెచ్‌సీలో గురువారం తెల్లవారు జామున సాధారణ కాన్పు ద్వారా 2.60 కేజీల పాప పుట్టిందన్నారు. డాక్టరు అనంతపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

పెదపాడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థి కె.నరేంద్రకుమార్ కాకినాడ జిల్లాలో ఆగస్టు నెలలో జరిగిన 60 కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్, రెండవ ప్లేస్ సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీకి అర్హత సాధించాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి నరేంద్రకుమార్‌ను పాలక మండలి సభ్యులు అల్లూరి ఇంద్రకుమార్, ఎంబీఎస్‌వీ ప్రసాద్, సత్యనారాయణ, సివిల్ హెచ్‌వోడీ కె.శ్రీనివాసరావు, పీడీ కృష్ణకాంత్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

పాము కాటుతో యువకుడి మృతి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యచంద్రరావుపేటలో పాముకాటుతో ఒక యువకుడు మృతి చెందాడు. చాపల అశోక్ కుమార్(23) స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం యథావిధిగా పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా పాముకాటు వేసింది. హుటాహుటిన భీమడోలులోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. అశోక్‌కు ఇంకా వివాహం కాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక - డిజిటల్ విద్యపై శిక్షణ

పెదపాడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్థికశక్తి శ్రీ శక్తి అని, ప్రతి మహిళ ఆర్థిక విద్య ద్వారా అభివృద్ధిని సాధించాలని వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి విజయ కుమార్ తెలిపారు. పెదపాడు మండల సమాఖ్య సమావేశ మందిరంలో ఎంపీడీవో అమీలు జమ అధ్యక్షతన ఉల్లాస్ అక్షరాంధ్ర - అక్షరాస్యతపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. వయోజన విద్య ఏపీడీ విజయకుమార్ మాట్లాడుతూ మహిళలు అక్షరాస్యత సాధించడం ద్వారా వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించగలరన్నారు. శిక్షణలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.పెద్దిట్లమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలోని పలు సమస్యలపై అమరావతి సచివాలయంలో ఆర్అండ్‌బీ, రవాణ శాఖ, సాంఘిక సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రులను కలిసి సమస్యలపై విజ్ఞాపనలు ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు. నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని రవాణ శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతుల కోసం 51 కోట్లు కావాలని ఒక నివేదికను రోడ్లు, భవనాల శాఖా మంత్రి జనార్ధన్‌రెడ్డిని కలిసి అందజేశారు.

సమావేశాలకు అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

చింతలపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు వివిధ శాఖల అధికారులు గైర్హాజరుకావడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులతో మాట్లాడాలంటే సమావేశాలకు గైర్హాజరవుతున్నారంటూ ప్రజా ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఎంపీపీ బి.రాంబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మండల పరిషత్‌కు రూ.30 లక్షలు వచ్చాయన్నారు. అధికారుల గైర్హాజరుపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రత్నకుమార్ పేర్కొన్నారు. నిధుల ఖర్చు విషయంలో తగిన విధంగా ప్రణాళిక రూపొందిస్తామని ఎంపీపీ వెల్లడించారు.

ఎండీయూ వాహనాలను వినియోగించుకోండి : డీటీసీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో పౌరసరఫరాల శాఖ వినియోగించిన ఎండీయూ వాహనాలను పౌరసరఫరాల శాఖ నుంచి తొలగించిన నేపథ్యంలో వాటి క్లాసాఫ్ వెహికల్‌ను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో మార్పించుకోవాలని ఏలూరు జిల్లా ఉపరవాణ కమీషనర్ షేక్ కరీమ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 వాహనాలను మొబైల్ క్యాంటిన్ నుంచి గూడ్స్ క్యారేజీకు మార్చుకోవాలని సూచించారు.

లోకేశ్‌ను కలిసిన జయరాజు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీ ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీకి అందించిన సేవలను గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరినట్టు జయరాజు తెలిపారు.

దసరా వేడుకలు నిర్వహిస్తాం

జీలుగుమిల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రాబోయే దసరా నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా ఎస్ఎస్ఎఫ్(సమరత సేవ ఫౌండేషన్) కృషి చేస్తుందని సంస్థ జిల్లా కన్వీనర్ తిప్పాబొట్ల రామకృష్ణ అన్నారు. జీలుగుమిల్లి శివారు రామన్నపాలెంలో ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ కొత్తూరి మోహన్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హిందూ ధార్మిక చైతన్యం ప్రజల్లో పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాగం సత్య నారాయణ, బొంతు రామకృష్ణ, తెల్లం వెంకటేశ్వరరావు, ఊక సూర్యచందరావు, పసుపలేటి కృష్ణమోహన్, కప్పల నిర్మల, బేబి, రేపాక గోపాలం, కక్కిరాల మురళీ, వేదుల జనార్దనరావు ఉన్నారు.

అంగన్వాడీ తనిఖీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం జేసీ పి.ధాత్రిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రం-3ని పరిశీలించి అంగన్వాడీని వివరాలు తెలుసుకున్నారు.

నేడు ఎంఈవో కార్యాలయం ప్రారంభం

పెదపాడు,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా ఎంఈవో కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎంఈవో సబ్బితి నరసింహామూర్తి తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు గురువులకు సన్మానం జరుగుతుందన్నారు.

6న వామపక్షాల నిరసన

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భారతీయ సరుకుల దిగుమతులపై ట్రంప్ సర్కార్ సుంకాలను నిరసిస్తూ ఈ నెల 6న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు వామపక్షాల నాయకులు మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, బద్దా వెంకట్రావులు గురువారం తెలిపారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

ఏలూరురూరల్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలంలోని మల్కాపురం, పాలగూడెం గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లస్టర్ ఇన్‌చార్జి నేతల రవి, మాజీ సర్పంచ్ లుకలాపు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కొట్టే సుబ్బారావు, జాలిపూడి సొసైటీ ఛైర్మన్ పవన్ పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలని ఆందోళన

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లు నిర్మించాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆశ్రం కళాశాల వెళ్లే రోడ్డు వద్ద గురువారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. వంగాయగూడెం-పెదపాడు రోడ్డు, ఇందిరమ్మకాలనీ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్, సీపీఎం నాయకులు పిల్లి రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, వై.ఎస్.కనకారావు, జె.గోపి, ఎం.ఇస్సాకు, కడలి రామాంజనేయులు, ఆర్.అరుణకుమారి, నత్తా సత్యనారాయణ, మీసాల సత్యం, ఎస్.సత్యనారాయణ, కె.లెనిన్, అమర్‌కుమార్, కొప్పాడ నరసింహస్వామి పాల్గొన్నారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు మంచినీళ్లతోటలో నివాసం ఉంటున్న న్యాయవాది(నోటరీ) బి.అచ్యుతరావు(66) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు.అకస్మాత్తుగా ఛాతీనొప్పి రావడంతో ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామం కోటేశ్వరదుర్గాపురంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

జీలుగుమిల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి తెలంగాణకు యూరియా అక్రమంగా తరలిపోకుండా విజిలెన్స్ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి జీలుగుమిల్లి ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న వాహనాలను విజిలెన్స్ ఎస్సై కె.నాగరాజు, వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు సిబ్బంది శ్రీను తనిఖీ చేశారు.

అయ్యప్ప పీఠానికి ఇత్తడి కవచం అందజేత



మండవల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం ఏలూరురోడ్డులోని అయ్యప్ప స్వామి పీఠానికి ఇత్తడి కవచం అమర్చారు. వీటిని కైకలూరుకు చెందిన దాత బుర్ల సత్యనారాయణ రూ.50వేలతో తయారుచేయించి గురువారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దాతను ఆలయ కార్యనిర్వాహకులు అభినందించారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు : ఎంపీడీవో సత్యనారాయణ

ముసునూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో బీఏ సత్యనారాయణ సూచించారు. గురువారం గోగులంపాడు, ముసునూరు, చెక్కపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న చెత్త సేకరణను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రోజు గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. ఈ ప్రక్రియపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సాగర్ జలాలతో చెరువులకు జలకళ



ముసునూరులో సాగర్ జలాలతో నిండిన కొత్తచెరువు

ముసునూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వేంపాడు మేజర్ కాలువ ద్వారా వస్తున్న సాగర్ జలాలతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో డీసీ చైర్మన్ రావర్ల బాలకృష్ణ, వైస్ చైర్మన్ చలమాల వెంకటేశ్వరరావులతోపాటు టీడీపీ నాయకులు, అధికారుల కృషితో సాగర్ జలాలు చెరువులకు చేరుతున్నాయి. ఇప్పటికే ముసునూరులో నల్ల చెరువు, కొత్తచెరువులు పూర్తిస్థాయిలో జలకళ ఉంది. లోపూడి, బసవరపుపాడు, చెక్కపల్లి, గోగులంపాడు, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న చెరువులతోపాటు వేంపాడు చివరి వరకు సాగర్ జలాలను తీసుకువెళ్ళేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది పంటలకు నీటి ఇబ్బందులు తొలిగినట్టేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పనితీరును రైతాంగం అభినందిస్తున్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సు అభ్యర్థులకు 9న కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):వైద్య ఆరోగ్య శాఖ జోన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కాంట్రాక్టు పద్ధతిన స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయడానికి ఈ ఏడాది జనవరిలో జారీచేసిన నోటిఫికేషన్ మేరకు మెరిట్ కం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపి కైన 59 మంది అభ్యర్థుల జాబితాను గురువారం వెబ్‌సైట్‌లో పొందు పర్చి నట్లు రాజమహేంద్రవరంలోని రీజినల్ డైరెక్టర్ తెలిపారు. జాబితాలో పేర్లు వున్న అభ్యర్థులు ఈ నెల 9న రాజమహేంద్రవరంలోని వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ నిమిత్తం హాజరు కావాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అదేరోజున కౌన్సె లింగ్ నిర్వహించి అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తామన్నారు.

'నూజివీడు'ను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి



మాట్లాడుతున్న రమేష్, దోనేటి శివాజి

నూజివీడు టౌన్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజక వర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపి నియోజకవర్గ ప్రజల ఆశాభావాలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు అట్లూరి రమేష్, ప్రొఫెసర్ దోనేటి శివాజీ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం నూజివీడులో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నూజివీడు ప్రజల ఆశాభావాలను కాదని, నియోజకవర్గాన్ని విడదీయడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో కలిపి అమరావతి రాజధానిలో భాగంగా మారుస్తూ గ్రామీణ ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎయిమ్స్‌కు అనుసంధానిస్తూ బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మారుబోయిన కోటేశ్వరరావు

స్వచ్ఛమైన సేవలే 'మానవత' లక్ష్యం

మండవల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కులమత వర్గ బేధాలు లేకుండా స్వచ్ఛమైన సేవలే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యం అని సంస్థ జిల్లా గౌరవ అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మండవల్లి శుభం ఫంక్షన్ హాలులో మానవత మండవల్లి శాఖ ద్వితీయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేకంగా రూ.50 లక్షలతో విద్యానిధిని ఏర్పాటు చేసి పేద విద్యార్థులను ఆదుకునేందుకు, కృషి చేస్తున్నామన్నారు. అనంతరం కూనపురెడ్డి కోటేశ్వరరావును మండవల్లిశాఖ అధ్యక్షు డిగా ప్రమాణస్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, చాపరాల దుర్గాప్రసాద్, సుదాబత్తుల విజయ్‌కుమార్, వీరమల్లు నరసింహారావు, గుర్రం శ్యామ్‌కుమార్, గుడివాడ గణేష్, పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలిగా దుర్గ

కలిదిండి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలిగా జమ్ము దుర్గ, కార్యదర్శిగా ఎస్.ఎన్.వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కలిదిండిలో వ్యవసాయ కార్మిక సంఘ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి శ్రామికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మా మంచి మాస్టార్లు

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బోధనలో రాణించడంతో పాటు ప్రతిభ కనబరుస్తున్న పలువురు ఉపాధ్యాయుల పరిచయం.

ఉత్తమ బోధన.. పాఠశాల అభివృద్ధి



విద్యాబోధన చేస్తున్న హెచ్ఎం నాగేశ్వరరావు

చాట్రాయి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతో పాటు పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత. పచ్చదనం పరిశుభ్రత నిండిన ఆహ్లాదకర వాతావరణంలో ఆట పాటల ద్వారా వినూత్న పద్ధతులతో విద్యా బోధన చేసి అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. చాట్రాయి మండలం పోలవరం కోనేరు రంగారావు కాలనీ పాఠశాల హెచ్ఎం, రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత రాయపూడి నాగేశ్వరరావు. ఆయన పనిచేసిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలలో ప్రతిభావంతులు, ఉన్నత విద్యావంతులుగా ఎదిగారు. మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. నాగేశ్వరరావు రూ.80 వేలు సొంత నిధులు ఖర్చు చేసి ఇప్పుడు పనిచేస్తున్న పాఠశాలకు పెయింటింగ్స్ బొమ్మలు వేయించి అందంగా తీర్చిదిద్దారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నాగేశ్వరరావు పోతనపల్లి, తుమ్మగూడెం, ఆరుగొలనుపేట, బూరుగుగూడెం, పోలవరం పాఠశాలలో పనిచేసి గ్రామస్తుల భాగస్వామ్యంతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దారు. 2017లో సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కలెక్టర్లు, పలు స్వచ్ఛంద సంస్థల నుంచి నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నూజివీడు టౌన్/చాట్రాయి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. నూజివీడు మండలం మద్దాయికుంట గ్రామ హైస్కూల్లో హెచ్ఎం దారపురెడ్డి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో, చాట్రాయి మండలం తుమ్మగూడెం దళితవాడ పాఠశాలలో హెచ్ఎం గంప వెంకట్రావు ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



క్రీడాకారుల భవిష్యత్‌కు బాట

ముసునూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): క్రీడా కారులకు సొంత ఖర్చుతో ప్రోత్సాహకాలను అంది స్తూ వారి భవిష్యత్‌కు బాట వేస్తున్నారు రమణ క్కపేట జడ్పీ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వాకా నాగరాజు. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫెన్సింగ్ తది తర ఆటల్లో గ్రామీణ ప్రాంతమైన రమణక్కపేట పాఠశాల నుంచి అనేక మంది బాల, బాలికలు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలను సాధిం చేలా ఆయన కృషి చేశారు. అరకొర వసతులు, మట్టి కోర్టులోనే శిక్షణ, పీడీ నాగరాజు ప్రోత్సాహంతో గత ఏడాది నరసారావుపేట, మార్టేరు, శ్రీకాకుళం, రామచంద్రాపురం, నంద్యాల, తెనాలి, విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించా రు. రాష్ట్రస్థాయిలో పలు విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించేలా కృషి చేశారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, రవాణ ఖర్చులు, పోషకాహారం కోసం దాతలను ఆశ్రయిస్తారు. సొంత సొమ్ము కూడా వెచ్చించి క్రీడాకారుల భవిష్యత్ కోసం నాగరాజు శ్రమిస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు వీరే..

డాక్టర్ మంగళగిరి హరిప్రసాద్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు



కైకలూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యా బోధనతో ఆయన పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. తాజాగా డాక్టర్ మంగళగిరి హరి ప్రసాద్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యా రు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 2006లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యా పకుడిగా చేరారు. 2014లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా అవార్డు అందుకున్నారు. జర్నలిజం నాగార్జున యూనివర్సిటీలో జర్నలిజం చేశారు. టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిప్లమో చేశారు. వివిధ విభాగాల్లో జిల్లాస్థాయిలో 15 ఉత్తమ అవార్డులను అందుకున్నారు. నాగార్జున యునివర్సిటీ నుంచి లేసు అల్లికలపై పీహెచ్‌డీ ద్వారా అందుకున్నారు. హిస్టరీపై 8 రాష్ట్రస్థాయి పుస్తకాలను రాసి ప్రశంసలను పొందారు. రాష్ట్ర స్థాయి అవార్డు స్ఫూర్తితో బోధన, పరిశోధనలకు మరింత ప్రాధాన్యం ఇస్తానన్నారు.

ఎన్.సాంబశివరావు

ప్రొఫెసర్, ఎన్ఆర్ఐ కళాశాల



ఆగిరిపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ విద్యారంగంలో అద్భుతమైన సేవలందించిన ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ కళాశాల ఈఈఈ విభాగం ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ ఎన్. సాంబశివరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవా ర్డు లభించింది. ఇంజనీరింగ్ కళాశాలల విభాగంలో ఈఈఈ శాఖ కేటగిరిలో అనేక సంవత్సరాలుగా బోధనలో నాణ్యతను పెంపొందిస్తూ, పరిశోధనలో విశిష్టమైన కృషిచేస్తూ, విద్యార్థులను సృజనాత్మక ఆలోచనలవైపు తీసుకెళుతున్నారు. 2015లో జేఎన్టీయూ కాకినాడ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. విద్యార్థుల ప్రాజెక్టులు, పరి శోధన పత్రాలు, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలు, విభాగం వృద్ధి అన్నింటిలోనూ ఆయన నాయకత్వం విశేషంగా నిలిచింది. ఈఈఈ విభాగాన్ని కొత్త ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయనకు అవార్డు రావడంతో పలువురు అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి..



ముసునూరు : సొంత సొమ్ము వెచ్చించి పాఠశాల అభివృద్ధికి రమణక్కపేట జడ్పీ పాఠశాల సోషల్ టీచర్ షేక్ షకీలా కృషి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పలు రకాల పండ్లు, ఇతర మొక్క లను నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పేద విద్యార్థులకు దుస్తులు సమకూర్చి చదువు కోసం అవసరమైన గైడ్స్, నోట్ బుక్స్, ఇతర సామగ్రి అందిస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన విద్యార్థులకు వైద్య సేవలు చేయిస్తున్నారు. సులభతరమైన విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. జాతీయ పండుగలకు నిర్వహించే ఆటల పోటీల్లో విజేతలకు ఆమె స్వయంగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. ప్రపంచ దేశాల్లో ఉన్న కరెన్సీ నాణెలను సేకరించి ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్, వంట ఏజన్సీ వర్కర్లకు సొంత ఖర్చులతో ఏటా దుస్తులు అందిస్తున్నారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యాక్రమాలు, పాఠశాల క్లబ్‌ల నిర్వహణలో షకీల టీచర్ క్రియాశీలక పాత్రతో అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



స్మార్ట్‌రేషన్ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ, కూటమి నేతలు

కైకలూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కైకలూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్యూఆర్‌కోడ్ స్మార్ట్ రేషన్‌కార్డులను ఎంపీపీ అడవి కృష్ణ పంపిణీ చేశారు. గురువారం కైకలూరు ప్రభుత్వఆసుపత్రి వెనుక వెలమపేట కాలనీలోని రేషన్‌షాపులలో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం స్మార్ట్‌కార్డులను ప్రవేశపెట్టిందని, కుటుంబ వివరాలన్నీ క్యూఆర్‌కోడ్ స్కాన్ ద్వారా వస్తాయన్నారు. ఈ విధానంతో సులభంగా రేషన్ పంపిణీకి దోహదపడుతుందన్నారు. టీడీపీ నాయకుడు బీకేఎం నాని, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, ఎస్సీసెల్ నాయకులు వీరాబత్తిన సుధా, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, రసూల్‌ఖాన్, బీజేపీ నాయకులు గరికిపాటి రాంబాబు, బాషా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడిన యువకులు

ముదినేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది చనిపోయేందుకు కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధురాలిని ఇద్దరు యువకులు రక్షించిన ఘటన ముదినేపల్లిలో గురువారం జరిగింది. ముదినేపల్లి మండలం కొరగుంటపాలెం గ్రామానికి చెందిన వనమరెడ్డి ఆనందమ్మ(85) ముదినేపల్లి ఆసుపత్రికి వెళ్తానని ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. సాయంత్రం ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కాలువలో దూకి ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడింది. కాలువలో కొట్టుకుపోతున్న ఆమెను వడాలి గ్రామానికి చెందిన నల్లపోతుల దుర్గారావు, ఆవుల మేరియ్య అనే యువకులు రక్షించారు. సమాచారం అందుకున్న ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో వెంటనే అక్కడికి వెళ్లి ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. స్థానిక ఆసుపత్రిలో ఆ వృద్ధురాలికి వైద్యం చేయించిన అనంతరం కొరగుంటపాలెంకు చెందిన ఆమె బంధువు అచ్యుత ప్రశాంత్‌కుమార్‌కు అప్పగించారు. వృద్ధురాలిని రక్షించిన వారిద్దరిని ఎస్ఐ అభినందించి సన్మానించారు.

శక్తి యాప్‌తో విద్యార్థినులు రక్షణ పొందాలి

చాట్రాయి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌ని విద్యార్థినులు, మహిళలు వినియోగించుకుని రక్షణ పొందాలని ఎంఈవో-2 వీఎస్వీ బ్రహ్మచారి, నూజివీడు సబ్ డివిజన్ శక్తి టీం ఇన్‌చార్జి నాగభూషణం కోరారు. చనుబండ జడ్పీ హైస్కూల్‌లో గురువారం శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ డయల్ 100, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలో రాట ప్రతిష్టిస్తున్న ప్రతాపరాజు దంపతులు, కూటమి నేతలు

శ్యామలాంబ ఆలయంలో దసరా ఉత్సవాల రాట ప్రతిష్ఠ

కైకలూరు,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో చండీ మహాయాగ సహిత శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాల కోసం రాట ప్రతిష్ఠ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం కైకలూరుకు చెందిన సంబూరి ప్రతాపరాజు దంపతులచే పూజలు చేసి రాట ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వగా అర్చకులు పూజలు చేశారు. ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించగా రాట ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, ఆలయ మాజీ చైర్మన్ జంపన రామలింగరాజు, బోయిన రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

500 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్ ఆసుపత్రి సిబ్బంది

ముదినేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం పెదపాలపర్రు, ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాల్లో 500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పెదపాలపర్రు హైస్కూల్‌లో ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లు అందించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుడివాడ వేణు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. క్లబ్ కార్యదర్శి పిల్లారిశెట్టి సతీశ్, కోశాధికారి కాసరనేని శ్రీనివాస్, రీజనల్ చైర్మన్ నిమ్మగడ్డ శివశంకర్, లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది తిరుపతి, స్టాన్ వెక్స్, హెచ్ఎంలు లక్ష్మీ రాజేశ్వరి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి'

ముసునూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఎంపీడీవో బీఏ సత్యనారాయణ అన్నారు. గురువారం చింతలవల్లి, సూరేపల్లి గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది ఉద్యోగులు విధులకు అలస్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయాలకు పలు సమస్యలపై వచ్చే ప్రజలకు సకల సదుపాయాలు కల్పించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సచివాలయాల నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ సగ్గూరి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ముదినేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పెదగొన్నూరు. 11కేవీ ఫీడర్‌లో విద్యుత్‌లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్లను తొలగించే పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పెదగొన్నూరు, ఉప్పరగూడెం, విశ్వనాధ్రిపాలెం, ఈడేపల్లి గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రైమ్ సమాచారం

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



నరసింహారావు మృతదేహం

కలిదిండి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహ త్యకు పాల్పడిన ఘటన గురువారం ఆవకూ రులో జరిగింది. గ్రామానికి చెందిన కాట్రగడ్డ నరసింహారావు(40) మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకపోవడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. అతడు మద్యానికి బానిసకావడంతో భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఈమేరకు అతడు మనస్తాపానికి గురై గురువారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్సకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వృద్ధుడు పురుగుల మందును తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. చాట్రాయి మండలం చీపురుగూడానికి చెందిన మానికల సత్యం(60) భార్య, పిల్లలు ఉండగా పిల్లలకు వివాహాలు అయ్యాయి. గురువారం ఉదయం అతిగా మద్యం తాగిన అతడు ఆ మద్యం మత్తులో పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పోతనపల్లిలో సారా స్వాధీనం

చాట్రాయి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోతనపల్లి గ్రామంలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి లావూరి కోదండ రామస్వామి, హసవతు సాయికుమార్‌లను అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల నాటు సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. దాడిలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్‌సింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేంటి మాస్టారు..?

(3వ పేజీ తరువాయి)

ఉన్నతపాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామోపాధ్యాయులకు అందజేయ నున్నారు. జిల్లాలో ఈ అవార్డులకు పెదవేగి, వట్లూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాల, ఏలూరు ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు, కొవ్వలి జడ్పీ హైస్కూలు ఎంపికయ్యాయి. ఈ అవార్డులతో పాటే ఇంటర్మీడియట్ విద్యనుంచి జిల్లా ఉత్తమ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన ఒకరికి పురస్కారాన్ని అందజేస్తారు. మొత్తంమీద 33 మందికి అవార్డులను శుక్రవారం అందజేయడానికి జిల్లావిద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

భారం దిగింది !

(3వ పేజీ తరువాయి)

సరుకు వచ్చినప్పుడు, తర్వాత అమ్మకాలు జరిగినప్పుడు లావాదేవీల్లో ఎగవేతలకు ఆస్కారం ఉండదని జీఎస్టీ అధికారులు అంచనా వేస్తున్నారు.

సైకిళ్లు, సిమెంట్‌పై ఎత్తివేయాలి..



జీఎస్టీ శ్లాబ్‌ల ఎత్తివేతతో చాలా మందికి ప్రయోజనం జరుగుతుంది. అయితే సైకిళ్లు, సిమెంట్ పైనా జీఎస్టీ ఎత్తివేయాలి. పేదలకు ఇది ఉపయోగపడేది. ఫెర్టిలైజర్స్, హ్యాండ్‌క్రాఫ్ట్స్, బయోవేస్ట్ ఉత్పత్తులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గిస్తే చాలా మందికి ఉపయోగం.

నేరేళ్ల రాజేంద్ర, జిల్లా మర్చంట్ ఛాంబర్స్ అధ్యక్షుడు

రోగులకు ఊరటే : ఎం.విక్రమ్, ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్

జీఎస్టీ శ్లాబ్‌ల మార్పుల వల్ల అన్ని మందులు వివిధ స్థాయిల్లో ధరల తగ్గుదల ఉంటుంది. 36 రకాల మందులపై పూర్తి స్థాయిలో పన్ను ఎత్తివేయడం నిరంతరం దీర్ఘకాలికంగా మందులు వాడేవారు చాలామంది ప్రజలకు ఊరటనిస్తుంది. రేట్లను కంపెనీలు పెంచకుండా నిరోధించ వచ్చు. పన్ను తగ్గే వరకు డీలర్లు 10 నుంచి 20 రోజులు సరఫరాలో అంతరాయం కలిగిస్తే వినియోగదారులు ఏలూరు పవర్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు





నూజివీడులో గణనాథుడికి పూజలు చేస్తున్న ముద్దరబోయిన.. వడ్లమానులో గణనాథుడి ఊరేగింపు

కైకలూరు/ఆగిరిపల్లి/చాట్రాయి/నూజివీడు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అనేక ప్రాంతాల్లో గణనాథుల విగ్రహాల ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కైకలూరు 2వ వార్డులోను, కోరుకొల్లు రోడ్డులోని కాళీకామాత అమ్మవారి వద్ద ఏర్పాటు చేసిన ఆది వినాయకస్వామి, వారపుసంత వద్ద ఆది వినాయకస్వామి, ఆటపాక గ్రామంలోని గణనాథుడిని ఊరేగింపు చేసి నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. కైకలూరు బైపాస్ రోడ్డులో తాపీ వర్కర్స్ యూనియర్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. సీతనపల్లి గ్రామంలో మూడు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆగిరిపల్లి మండలంలోని వడ్లమా ను, చొప్పరమెట్ల, నూగొండపల్లి గ్రామాల్లో గణాధుల విగ్రహాలను సాంస్కృతిక కార్యక్రమాల మధ్య భక్తులు నిమజ్జనం చేశారు. వడ్లమాను గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చాట్రాయి మండలంలో ఎన్టీఆర్ కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి టీడీపీ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ పలగాని దుర్గారావు, దంపతులు, చల్లపల్లి నాగరాజు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నూజివీడు పట్టణ, మండల పరిధిల్లో పలు గ్రామాల్లోని ఏర్పాటుచేసిన గణనాథుడిని నిలువెత్తు విగ్రహా లకు అర్చకులు పూజలు నిర్వహించారు. నూజివీడు మండలం పాతరావిచర్ల గ్రామంలో గణేష నవరాత్రుల పూజా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నూజివీడు పట్టణంలోని 31వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని మంత్రి పార్థసారథి తనయుడు టీడీపీ నాయకుడు నితిన్‌కృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కలిదిండి వినాయకుడి లడ్డూలు రూ.83 వేలు

కలిదిండి: కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయకుడికి దాతలు సమర్పించి తాపేశ్వరం లడ్డూలను గురువారం వేలం పాట నిర్వహించారు. 50 కిలోల లడ్డూను రూ.60 వేలకు బోయిన భోగేశ్వరరావు దక్కించుకున్నారు. 25 కిలోల లడ్డూను రూ.16 వేలకు వసంత టీ స్టాల్ యాజమాన్యం మరో 21 కిలోల లడ్డూను మారుబోయిన నాగపండు రూ.7 వేలకు పాడుకున్నారు.